www.nagaranijam.com
PRGI/RNI NO : APTEL/2013/54450




# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక




సంపుటి : 14 | సంచిక : 151 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 22,శనివారం,ఆగస్టు,2026 | పేజీలు : 8+ | ₹ 3
Volume : 14 | Issue : 151 | Rangareddy | Editor : Aela.Purushotham | 22,Saturday,August,2026 | Pages : 8+ | Price : 3/-
Published From Rangareddy, Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## కేంద్ర అనుమతి నిరాకరణతో రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు



హైదరాబాద్, ఆగస్టు 21, (నగర నిజం) : కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటనను రద్దు చేసుకుంది. యూకే, అమెరికా పర్యటనలో భాగంగా ముందుగా లండన్ చేరుకున్న ప్రతినిధి బృందానికి అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించింది. రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించినట్లు కేంద్రం వెల్లడించడంతో ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. యూకే, అమెరికా పర్యటనలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం కేంద్ర అనుమతిని కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే కేంద్రం అనుమతి ఇచ్చింది. అనంతరం అమెరికా పర్యటనకు అనుమతి లభించకపోవడంతో బోస్టన్ పర్యటనను రద్దు చేసుకుని లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతితో పాటు దేశ నిర్మాణానికి దోహదపడే లక్ష్యంతో చేపట్టిన పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిపారు.

### యువతకు ప్రపంచ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

తన అమెరికా పర్యటన ఉద్దేశం రాజకీయాలకు సంబంధం లేనిదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న తెలంగాణ యువత ఆకాంక్షలకు సమాధానంగా అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేయాలని భావించినట్లు పేర్కొన్నారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు వంటి అంశాల్లో రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా అందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### అమెరికా కార్యక్రమాలు కొనసాగించాలి

అమెరికా పర్యటన రద్దయినప్పటికీ అక్కడి వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే ప్రారంభించిన సంప్రదింపులను కొనసాగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆయా విశ్వవిద్యాలయాలతో అవసరమైన అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని సూచించారు. అమెరికా పర్యటనలో ప్రతిపాదించిన విద్యా, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అధికారుల బృందం ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.

### హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ వరకు ఏర్పడిన విద్యా సంస్థలు నగరాన్ని అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా తీర్చిదిద్దాయని పేర్కొన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నుంచి ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన సాంకేతిక రంగ నాయకులు ఎదిగారని గుర్తుచేశారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి ప్రముఖ విద్యా సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి సంస్థలను, వాటి అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలను ఆకర్షించగలిగిందని చెప్పారు.

### ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడమే లక్ష్యం

ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి 21వ శతాబ్దపు అభివృద్ధి ప్రయాణానికి మరింత శక్తినిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్‌ఎస్‌ఈ వంటి ప్రపంచ స్థాయి సంస్థల నుంచి విద్య, ధ్రువపత్రాలు పొందే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. తమ పిల్లలను విదేశాలకు పంపించాలన్న ఆలోచనకు బదులుగా ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలన్నదే తన అభిలాష అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### యూకే పర్యటనలో కీలక సమావేశాలు

అమెరికా పర్యటన రద్దయినప్పటికీ షెడ్యూల్ ప్రకారం యూకే పర్యటన కొనసాగనుంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర ప్రముఖ విద్యా సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అలాగే యూకేలోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో చర్చలు జరిపి తెలంగాణతో భాగస్వామ్యాలను ఖరారు చేసేందుకు ప్రయత్నించనున్నారు. అమెరికా పర్యటన రద్దయినా అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాల ఏర్పాటు, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యాలను కొనసాగిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# ఆక్స్‌ఫర్డ్ భాగస్వామ్యంతో తెలంగాణలో విద్యా విస్తరణకు సీఎం ఆహ్వానం

లండన్, ఆగస్టు 21, (నగర నిజం) : తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా, పరిశోధన అవకాశాలను విస్తృతం చేసేందుకు ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం భాగస్వామి కావాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం శుక్రవారం సుమారు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే అంశాలపై ప్రముఖ విద్యావేత్తలతో విస్తృతంగా చర్చించారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిధిలోని బ్లోవాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌కు చెందిన ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీకి చెందిన ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ దార్శనికతను వారికి వివరించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలు, చేపడుతున్న చర్యలను వివరించారు.

### హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటు చేయాలని ఆహ్వానం

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తన కార్యనిర్వాహక విద్యా కార్యక్రమాలు, ప్రత్యేక పరిశోధన సామర్థ్యాలు, విస్తృత విద్యా వ్యవస్థను హైదరాబాద్‌కు తీసుకురావాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్‌లో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ యువత, ఉద్యోగ నిపుణులకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన అవకాశాలు అందించాలని ఆహ్వానించారు.





ఈ సమావేశంలో సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం కింద విదేశీ విశ్వవిద్యాలయాలకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఆయన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్, తెలంగాణలో విదేశీ విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ఉన్న అవకాశాలు, వాటికి లభించే ప్రయోజనాలను వివరించారు.

### భాగస్వామ్యానికి ఆక్స్‌ఫర్డ్ సానుకూలత

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర యువత, ఉద్యోగ నిపుణులతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను వారు ప్రస్తావించారు. డిసెంబర్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ ప్రపంచ సదస్సుకు ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులను తెలంగాణ బృందం ఆహ్వానించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో ఈ సదస్సు జరగనుంది.

### సోమర్‌విల్ కాలేజీలో ఇందిరాగాంధీ చిత్రపటం

అనంతరం ముఖ్యమంత్రి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. ఈ కాలేజీలో విద్యాభ్యాసం చేసిన దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిత్రపటాన్ని తిలకించారు. 2002లో సోనియా గాంధీ ఈ చిత్రపటాన్ని సోమర్‌విల్ కాలేజీకి బహూకరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

### ప్రపంచస్థాయి క్రీడా మౌలిక వసతులపై చర్చ

అనంతరం ముఖ్యమంత్రి జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రంథితో కలిసి అక్కడి సమగ్ర క్రీడా సదుపాయాలను పరిశీలించారు. గోల్ఫ్ కోర్స్‌తో పాటు వివిధ క్రీడలకు సంబంధించిన మౌలిక వసతులు, హోటల్‌ను సందర్శించారు. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిపై జీఎంఆర్ ప్రతినిధులు, సంస్థ అంతర్జాతీయ క్రీడా విభాగంతో ముఖ్యమంత్రి చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి ప్రపంచస్థాయి క్రీడా మౌలిక వసతుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జీఎంఆర్ ప్రతినిధులను ఆహ్వానించారు.

### ఆర్సెనల్-కోవెంట్రీ మ్యాచ్‌కు హాజరు

లండన్ పర్యటనలో భాగంగా ప్రస్తుత ప్రీమియర్ లీగ్ చాంపియన్స్ ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య శుక్రవారం జరిగే మ్యాచ్‌ను వీక్షించేందుకు ముఖ్యమంత్రి ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. విద్యతో పాటు క్రీడా రంగంలోనూ తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టే లక్ష్యంతో ఈ పర్యటనలో పలు కీలక సమావేశాలు, చర్చలు కొనసాగుతున్నాయి.



# నూతన చేయూత పింఛన్ల కొరకు లబ్ధిదారు దరఖాస్తులు చేసుకోవాలి

- **మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో : నగర నిజం : మెదక్ 21 ఆగస్టు 2026**చేయూత పింఛన్ల దరఖాస్తుల పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు, అలాగే ఈనెల 26వ తేదీన దివ్యాంగుల కొరకు ప్రత్యేక యు డి ఐ డి శిబిరం నిర్వహిస్తున్నట్లు చేయూత పింఛన్ల దరఖాస్తులు మండల మరియు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శు క్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ పై జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ కొత్త చేయూత పింఛన్లు దరఖాస్తులు మండల మరియు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని , తెలిపారు. దరఖాస్తుల స్వీకరణలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైన ఎడల వెంటనే దరఖాస్తుదారులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు.8008556112 చేయూత పెన్షన్లు హెల్ప్ డెస్క్ నెంబర్ ను సంప్రదించాలన్నారు.ఇంకా ఎవరైనా దివ్యాంగులు యూ డి ఐ డి ధ్రువీకరణ పత్రం లేనియెడల వారు తక్షణమే మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకున్న ఎడల ఆగస్టు 26వ తేదీన మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ++ం లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఇంకా మిగిలి ఉన్న వారు మీసేవ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులు ఏదైనా ధృవీకరణ పత్రం లేనియెడల వెంటనే సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్లి తక్షణమే తీసుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధ్రువీకరణ పత్రాలు తీసుకునేటప్పుడు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కలెక్టరేట్లో ఉన్న హెల్ప్ డెస్క్ సహాయకారిణిగా పనిచేస్తుందని,సమస్య ఉన్నట్లయితేవెంటనే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలన్నారు. అర్హులైన వారు చేయూత పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని వీరికి ప్రభుత్వ యంత్రాంగం సహాయకారిణిగా పనిచేస్తుందన్నారు.లబ్ధిదారుల చేసుకున్న దరఖాస్తులను సకాలంలో తీసుకొని వెంటనే ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సంబంధిత ఎంపీడీఓ లను కలెక్టర్ ఆదేశించారు.

# రూపా రెడ్డి హత్యకు నిరసనగా మేడ్చల్‌లో శాంతి ర్యాలీ

- **ఉపాధ్యాయుల భద్రత.. విద్యార్థులపై**

## తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

**మేడ్చల్, ఆగస్టు 21 (నగర నిజం):** నల్గొండ జిల్లాలోని నాగార్జున హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రూపా రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం మేడ్చల్ మండల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ, పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, రూపా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

## ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలి

ర్యాలీలో ఉపాధ్యాయుల్లో పెరుగుతున్న అభద్రతాభావంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మార్కులు రావాలన్నా, క్రమశిక్షణ నేర్పాలన్నా, తప్పు చేసినప్పుడు మందలించాలన్నా ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయులకు పూర్తి భద్రత కల్పించాలని కోరారు.

## పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్ ఇచ్చి వదిలేయకుండా వారు ఏం చూస్తున్నారు, ఎలాంటి కంటెంట్‌ను అనుసరిస్తున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు గమనించాలన్నారు. మొబైల్ ఫోన్ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా ఉందన్నారు.

## పిల్లలతో మనసు విప్పి మాట్లాడాలి



పిల్లలపై అతి ప్రేమ చూపిస్తూ వారి ప్రతి కోరికను తీర్చడం కంటే, వారిలో ఏర్పడుతున్న మానసిక ఒత్తిడిని గుర్తించి సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో మనసు విప్పి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు.

## పేరెంట్-టీచర్ మీటింగ్స్‌లకు తల్లిదండ్రులు హాజరు కావాలి

పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటారని, ఇంటికి వెళ్లిన తర్వాత కూడా తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని అన్నారు. పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్–టీచర్ మీటింగ్స్‌కు తల్లిదండ్రులు క్రమం తప్పకుండా హాజరై పిల్లల చదువు, నడవడిక, ప్రవర్తనపై యాజమాన్యం, ఉపాధ్యాయులతో చర్చించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో TRSMA మేడ్చల్ జిల్లా ట్రెజరర్ గిరిబాబు, మండల జనరల్ సెక్రటరీ రాధాకృష్ణ, ట్రెజరర్ జీఎల్‌వీ నారాయణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ లవకుమార్ గౌడ్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు మాథ్యూ జోసెఫ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులతో పాటు మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బీమా ద్వారా సాగునీరు అందించాలి

- బిజెపి మండల అధ్యక్షుడు ఆవుల నారాయణ.



**వీపనగండ్ల.ఆగస్టు21(నగర నిజం):** మండలంలోని బీమా ఆయకట్టు పొలాలకు కాలువల ద్వారా సాగునీరు అందించాలని బిజెపి మండల అధ్యక్షుడు ఆవుల నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని చెప్పి తీరా సాగు చేసిన తర్వాత బీమా తాయకట్టు పంటలకు సాగునీరు.అందించకపోవడం దారుణం అన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు తన సొంత మండలమైన చిన్నంబావిలో జూరాల చిన్నమారు లిస్టుల ద్వారా చెరువులు కుంటలు నింపుతూ సాగునీరు అందిస్తున్నారని వీపనగండ్ల మండలంలో బీమా లో లేవర్ హై లెవెల్ కెనాల ద్వారా ఆయకట్టుకుంటలకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు ఐదు రోజుల్లో నీటిని విడుదల చేయకపోతే రైతులను సమీకరించి నియోజకవర్గం ఇన్చార్జి ఎల్లేని సుధాకర్ రావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు కరెంటు సమస్యతో రైతుల ఇబ్బందులు.ఎదుర్కొంటున్నారని కనీసం 18 గంటలైనా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రాకేష్ యాదవ్ జిల్లా కౌన్సిల్ నెంబర్ నరేష్ ప్రధాన కార్యదర్శి శివ యాదవ్ విష్ణ తదితరులున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష



వీపనగండ్ల. ఆగస్టు 21(నగర నిజం):మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన అంజనేయులుకు రెండు రోజుల కిందట డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో శుక్రవారం నాడు వనపర్తి జిల్లా కోర్టులో హాజరు పరచగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ నరేష్ శుక్రవారం విలేకరులకు తెలిపారు వాహనాలను తనిఖీ చేస్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డ ఆంజనేయులు కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి శ్రీలత జైలు శిక్ష విధించినట్లు తెలిపారు మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్య నేరమని తెలిపారు మండలంలో ఉన్న గ్రామాల ప్రజలు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఎస్సై కోరారు.

## కండ్లకోయలో గుర్తుతెలియని మహిళ మృతదేహం



**మేడ్చల్, ఆగస్టు 21 (నగర నిజం):** మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కండ్లకోయలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. బుధవారం సుమారు 50--55 ఏళ్ల వయసున్న మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలి ఆచూకీ, పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఫొటోలోని మహిళను ఎవరైనా గుర్తించినట్లయితే, వెంటనే మేడ్చల్ పోలీసులకు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# శంషాబాద్‌లో వైభవంగా కాంగ్రెస్ నేత గణేష్ గుప్తా జన్మదిన వేడుకలు





- **జన్మదిన వేడుకల్లో పాల్గొని గణేష్ గుప్తాను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, వివిధ పార్టీల నేతలు**
- **జన్మదిన వేడుకలతో గణేష్ గుప్తా నివాసం వద్ద మిన్నంటిన సంబరాలు**

### 3000 మందికి అన్నదానం

**రాజేంద్రనగర్, ఆగస్టు 21 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేత, శంషాబాద్ మాజీ సర్పంచ్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రధాన అనుచరుడు ఆర్. గణేష్ గుప్తా జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి. ఈ జన్మ దిన వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి గణేష్ గుప్తాను ఆశీర్వదించారు. మరోవైపు పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు భారీగా తరలివచ్చి గణేష్ గుప్తాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన వేడుకలకు హాజరైన దాదాపు 3,000 మందికి అన్నదానం నిర్వహించారు. దీంతో శంషాబాద్‌లోని గణేష్ గుప్తా నివాస ప్రాంగణం కోలాహలంగా మారింది. రంగారెడ్డి జిల్లా లోని శంషాబాద్ కు చెందిన స్థానిక మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ ఆర్.గణేష్ గుప్తా గుప్తా పార్టీలో చురుకైన నేతగా కొనసాగుతున్నారు. అంచెలంచెలుగా యువ నేతగా ఎదిగిన ఆర్.గణేష్ గుప్తా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రధాన అనుచరుడిగా కొనసాగుతున్నారు. శంషాబాద్ సర్పంచ్‌గా, కౌన్సిలర్‌గా పదవులు నిర్వర్తించిన గణేష్ గుప్తా.... గతంలో ఓసారి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి తన రాజకీయ గురువు ప్రకాష్ గౌడ్ చేతిలో ఓటమిని చవిచూశారు. అయితే శుక్రవారం నాడు పవిత్ర శ్రావణ శుక్రవారానికి తోడు గణేష్ గుప్తా జన్మదిన వేడుకలు కావడంతో శంషాబాద్ లోని ఆయన నివాస ప్రాంగణం అభిమానుల తో సందడిగా మారింది. పార్టీలకు అతీతంగా శంషాబాద్ సర్కిల్ మరియు మండలం తో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం, రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ ప్రాంతాల నుండి అభిమానులు, వివిధ పార్టీల నేతలు కార్యకర్తలు వందలాదిగా తరలివచ్చి గణేష్ గుప్తా చేత కేక్ కట్ చేయించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై గణేష్ గుప్తాను ఆశీర్వదించారు. శంషాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుష్మా మహేందర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కోడిగంటి చంద్రారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ 119 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ పి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్, స్థానిక నేతలు తోట రామకృష్ణారెడ్డి అలియాస్ రాము, మహమ్మద్ జహంగీర్ (మాజీ కౌన్సిలర్),వై. కుమార్ (మాజీ కౌన్సిలర్), ఉప్పునుంతల అజయ్ (మాజీ కౌన్సిలర్), కే.యం. మురళి (మాజీ కౌన్సిలర్), సుదర్శన్ ముదిరాజ్, పోతుగంటి సునీత దయానంద్ (మాజీ కౌన్సిలర్), బొబ్బిలి ఉమామహేశ్వర్ ముదిరాజ్, కృష్ణ కుమార్ అలియాస్ కిట్టు తదితరులు గణేష్ గుప్తా చేత కేక్ కట్ చేయించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి, భారీ గజమాలతో సన్మానించారు.

### గణేష్ గుప్తాకు పాలమాకుల సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్ అభినందనలు

శంషాబాద్ మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పాలమకుల్ గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్ గణేష్ గుప్తాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గణేష్ గుప్తా నివాసానికి చేరుకున్న కోటేశ్వర్ గౌడ్.... ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

### 3000 మందికి అన్నదానం

గణేష్ గుప్తా జన్మదిన వేడుకల నేపథ్యంలో వేడుకలకు హాజరైన దాదాపు 3,000 మందికి అన్నదానం నిర్వహించారు.

### ఫ్లెక్సీలతో నిండిపోయిన శంషాబాద్

తమ అభిమాన నాయకుడు ఆర్ గణేష్ గుప్తా జన్మదిన వేడుకల నేపథ్యంలో పార్టీ నేతలు కార్యకర్తలతో పాటు అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పెద్ద ఎత్తున శంషాబాద్ లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తా నుండి శంషాబాద్ లోని నలు వీధులు ఫ్లెక్సీలతో నిండిపోయాయి.



# పెద్ద గోల్కొండ వద్ద ఔటర్ పై కారు బీభత్సం





- **అదుపుతప్పి డ్యూటీలో ఉన్న హెచ్ఎండిఏ కార్మికుడిని ఢీకొట్టిన కారు**
- **హెచ్ఎండిఏ కార్మికుడు నరసింహా మృతి**
- **మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి అంటూ ఔటర్ పై బైఠాయించి కార్మికులతో పాటు కుటుంబ సభ్యుల రాస్తారోకో**
- **మృతుడు నాగారంకు చెందిన నవీన్ రాజ్ అలియాస్ నరసింహగా గుర్తించిన పోలీసులు**

**రాజేంద్రనగర్, ఆగస్టు 21 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ కారు బీభత్సం. అదుపుతప్పి ఔటర్ రింగ్ రోడ్డు పై విధి నిర్వహణలో ఉన్న కార్మికుల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్యూటీలో ఉన్న నరసింహ అనే ఒక కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. దీంతో ఆగ్రహించిన తోటి హెచ్ఎండిఏ కార్మికుల తో పాటు మృతుడి కుటుంబ సభ్యులు ఔటర్ రింగ్ రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలి అంటే రాస్తారోకో చేపట్టారు. తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ఘటన శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 15 పై శుక్రవారం నాడు చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.... మహేశ్వరం మండలం లోని నాగారం గ్రామానికి చెందిన నమీరిగళ్ళ నవీన్ రాజ్ అలియాస్ నరసింహ (50) అనే వ్యక్తి గత కొంతకాలంగా హెచ్ఎండిఏ లో నర్సరీ కార్మికుడి గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు మాదిరిగానే శుక్రవారం నాడు తోటి కార్మికులతో కలిసి డ్యూటీకి వెళ్ళిన నవీన్ రాజ్... శంషాబాద్ మండలం లోని పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నెంబర్ 15 వద్ద మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు. ఇంతలో అదుపుతప్పిన వేగంతో దూసుకొచ్చిన ఓ కారు ఇది నిర్వహణలో ఉన్న నవీన్ రాజ్ అలియాస్ నరసింహ ను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీంతో తోటి హెచ్ఎండిఏ కార్మికులతో పాటు మృతుడి కుటుంబ సభ్యులు తమ కుటుంబానికి న్యాయం చేయాలి అంటూ ఔటర్ రింగ్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో ఔటర్ రింగ్ రోడ్డుపై కొద్దిసేపు బారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న శంషాబాద్ పోలీసులు... ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మిరప శంషాబాద్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# వనపర్తి బీసీ హాస్టల్‌లో బియ్యం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

- **46 క్వింటాళ్లకు బదులు 25 క్వింటాళ్లు మాత్రమే? 15 క్వింటాళ్ల "హ్యాండ్ లోన్"పై స్పష్టత ఇవ్వాలి**
- **పంచనామా ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **పిడిఎస్ యు బిసి పొలిటికల్ జే ఏసీ**

### బంజారా గిరిజన విద్యార్థి సమైక్య డిమాండ్





**వనపర్తి, ఆగస్ట్ 21 ;**వనపర్తి ప్రభుత్వ బీసీ కాలేజ్ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల భోజనం కోసం కేటాయించిన బియ్యం విషయంలో తీవ్రమైన అనుమానాలు, వ్యత్యాసాలు వెలుగులోకి వచ్చాయని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, పిడిఎస్ యు బిసి పొలిటికల్ జే ఏసీ బంజారా గిరిజన విద్యార్థి సమైక్య నాయకులు తెలిపారు.హాస్టల్‌కు 46 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా 25 క్వింటాళ్ల బియ్యం మాత్రమే తీసుకువచ్చినట్లు తమకు లభించిన సమాచారం, ప్రాథమిక పరిశీలనలో వెల్లడైందని వారు తెలిపారు. ఈ వ్యవహారంపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కి ఫిర్యాదు చేయడంతో, వారి ఆదేశాల మేరకు వనపర్తి తహసీల్దార్ హాస్టల్‌కు చేరుకుని సంబంధిత రికార్డులు, బియ్యం నిల్వలను పరిశీలిస్తూ పంచనామా నిర్వహించినట్లు తెలిపారు.పంచనామాలో నమోదు చేసిన వివరాల ప్రకారం, 13-08-2026న 15 క్వింటాళ్ల బియ్యాన్ని "హ్యాండ్ లోన్"గా తీసుకున్నట్లు హాస్టల్ వార్డెన్ నరేందర్ రెడ్డి పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు. అయితే సంబంధిత గోదాం అధికారులను సంప్రదించినప్పుడు, హాస్టల్‌కు 15 క్వింటాళ్ల బియ్యాన్ని హ్యాండ్ లోన్‌గా ఇచ్చినట్లు తమ వద్ద ఎలాంటి రికార్డు లేదని గోదాం సిబ్బంది తెలిపినట్లు వారు పేర్కొన్నారు.అసలు 15 క్వింటాళ్ల బియ్యం ఎక్కడికి వెళ్లింది?గోదాం రికార్డుల్లో జారీ వివరాలు లేకపోతే, 15 క్వింటాళ్ల బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలించబడింది? ఎవరు స్వీకరించారు? ఎక్కడ వినియోగించారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని పిడిఎస్ యు బిసి పొలిటికల్ జే ఏసీ తదితర విద్యార్థి సంఘాల నాయకులు పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు కే పవన్ కుమార్ దేవర శివ గౌడ్ టౌన్ ప్రెసిడెంట్, మహేందర్ నాయుడు, ధర్మేందర్, రాజు, బాలవర్ధన్,బంజారా గిరిజన విద్యార్థి శివ నాయక్ నేడొక ప్రకటనలో డిమాండ్ చేశారు.అలాగే పంచనామాలో నమోదు చేసిన బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్, గోదాం జారీ వివరాలు, రవాణా వాహన వివరాలు, హ్యాండ్ లోన్‌కు సంబంధించిన రికార్డులు అన్నింటినీ పరస్పరం సరిపోల్చి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు..విద్యార్థుల భోజన బియ్యంపై అక్రమాలకు తావు లేదుప్రభుత్వ బీసీ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కేటాయిస్తున్న బియ్యం పేద విద్యార్థుల హక్కు అని, ఆ బియ్యంలో ఒక్క కిలో కూడా పక్కదారి పట్టకుండా అధికారులు కఠిన పర్యవేక్షణ చేయాలని నాయకులు అన్నారు.46 క్వింటాళ్లకు బదులు 25 క్వింటాళ్లు మాత్రమే ఎందుకు వచ్చాయి?15 క్వింటాళ్ల హ్యాండ్ లోన్‌కు గోదాం రికార్డు ఎక్కడ ఉంది?బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్ ఎందుకు సరిపోవడం లేదు?బియ్యం రవాణా వివరాలు ఏమిటి?బాధ్యత ఎవరిది?అనే ప్రశ్నలకు జిల్లా యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 21-08-2026న నిర్వహించిన పంచనామాను ఆధారంగా తీసుకుని సమగ్ర విచారణ జరపాలి. హాస్టల్ మరియు గోదాం స్టాక్ రిజిస్టర్లను క్రాస్ వెరిఫై చేయాలి. 15 క్వింటాళ్ల హ్యాండ్ లోన్ వ్యవహారంపై గోదాం రికార్డులను పరిశీలించాలి. బియ్యం రవాణాకు సంబంధించిన వాహనం, డ్రైవర్, రవాణా మరియు డెలివరీ వివరాలను పరిశీలించాలి.గత కాలానికి సంబంధించిన బియ్యం స్టాక్, ఇండెంట్, మెస్ వినియోగం, డైట్ బిల్లులను కూడా ఆడిట్ చేయాలి.విచారణలో అక్రమాలు రుజువైతే సంబంధిత బాధ్యులపై శాఖాపరమైన మరియు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వానికి నష్టం జరిగినట్లు తేలితే బాధ్యుల నుంచి నష్టపరిహారం/రికవరీ చేయాలి.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సరిపడా బియ్యం నిరంతరం అందేలా ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి."విద్యార్థుల కడుపు నింపాల్సిన బియ్యం పక్కదారి పట్టడానికి వీల్లేదు. పంచనామాలో వెలుగులోకి వచ్చిన అంశాలపై నిష్పక్షపాత విచారణ జరిపి, తప్పు చేసిన వారు ఎవరైనా సరే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారాన్ని అధికారులు తేలికగా తీసుకోకుండా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలి" అని డిమాండ్ చేశారు.

# ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతులపై కాంగ్రెస్ అనవసర రాజకీయం మానుకోవాలి

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాశీచందర్ రావు**

**హైద్రాబాద్ ఆగస్ట్ 21:**భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాశీచందర్ రావు గారు మాట్లాడారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతుల వ్యవహారంతో పాటు మెడికల్ విద్యార్థుల ఫీజుల సమస్యలపై ఆయన కీలక ప్రకటనలు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

### బీజేపీలోకి ప్రముఖ వైద్యుల చేరిక

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్యాన్సర్ నిపుణులు, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ పోస్ట్ గ్రాడ్యుయేట్, క్యాన్సర్ రిహాబిలిటేషన్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ విజయేందర్ గారిని, అలాగే ఎల్బీ నగర్ మేఘనా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రమోద్ గారిని శ్రీ ఎన్. రామచందర్ రావు గారు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కమిటీలను నిర్మించి విశేష సేవలందిస్తున్న డాక్టర్ విజయేందర్ గారు, తోటి వైద్యులందరి మద్దతును బీజేపీకి సమీకరిస్తూ పార్టీలో చేరడం ఎంతో శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.

### ముఖ్యమంత్రి విదేశీ పర్యటన అనుమతులపై స్పష్టత

ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు విదేశాంగ మంత్రిత్వ శాఖ పొలిటికల్ క్లియరెన్స్ ఇవ్వకపోవడం వెనుక ఎటువంటి



రాజకీయ కోణం లేదని శ్రీ ఎన్. రాశీచందర్ రావు గారు స్పష్టం చేశారు. సీఎంతో పాటు వెళ్లే అధికారుల ప్రతినిధి బృందానికి పెట్టుబడులు, ఒప్పందాల కోసం సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇప్పటికే కేంద్రం అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధంగా ముఖ్యమంత్రులు లేదా మంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్లే సమయంలో ఆ పర్యటన అధికారిక ఆవశ్యకత, ఆహ్వానించిన సంస్థల నేపథ్యం, హాజరయ్యే వ్యక్తుల స్థాయి, అంతర్జాతీయ ప్రోటోకాల్, డిప్లొమాటిక్ అంశాలు, భద్రతా ఏర్పాట్లు, ఎఫ్‌సీఆర్ఏ (ఖీజ=ూ) నిబంధనలు తదితర కీలక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకుంటుందని వివరించారు.గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2012లో నాటి అస్సాం కాంగ్రెస్ ముఖ్యమంత్రి తరుణ్ గొగొయ్ అమెరికా, ఇజ్రాయెల్ పర్యటనలను, అలాగే జార్ఖండ్ నాటి బీజేపీ సీఎం అర్జున్ ముండా థాయిలాండ్ పర్యటనను కేంద్రం తిరస్కరించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతేకాకుండా నాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ నరేంద్ర మోదీ గారికి అమెరికా వీసా రాకుండా కాంగ్రెస్ ఎంపీలు, నాయకులు కుట్రపూరితంగా లేఖలు రాసిన చరిత్రను గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి గారు గతంలో విదేశాలకు వెళ్లినప్పుడు కేంద్రం ఎలాంటి అడ్డంకులు సృష్టించలేదని, తాజా పర్యటనకు సంబంధించిన నిబంధనలు, విధివిధానాల లోపాల ప్రకారమే నిర్ణయం జరిగిందని, దీనిని రాజకీయం చేయవద్దని హెచ్చరించారు.

### ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజు దోపిడీపై ఆగ్రహం:రీఫండ్‌కు డిమాండ్:లి

నీట్ ద్వారా ప్రవేశాలు పొందిన ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి ప్రైవేట్ మెడికల్ కాలేజీలు అక్రమంగా ఫీజులు వసూలు చేయడంపై శ్రీ ఎన్. రాశీచందర్ రావు గారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాలుగున్నర సంవత్సరాల కోర్సు ఫీజును ఐదు వాయిదాలలో చెల్లించాలని తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ నిర్దేశించినప్పటికీ, కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా ఐదేళ్ల పూర్తి ఫీజును వసూలు చేస్తూ ఒక్కో విద్యార్థి కుటుంబంపై 13 లక్షల నుండి 20 లక్షల వరకు అదనపు భారం మోపాయని మండిపడ్డారు. విద్యార్థుల నుండి అదనంగా వసూలు చేసిన ఫీజులను వెంటనే వాపస్ చేయాలని టీఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ గోపాల్ రెడ్డి గారితో పాటు హైకోర్టు కూడా స్పష్టమైన తీర్పులిచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఐవీజు) తక్షణమే జోక్యం చేసుకుని ఆయా ప్రైవేట్ కళాశాలల నుంచి విద్యార్థులకు ఫీజులు రీఫండ్ అయ్యేలా కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుల పక్షాన బీజేపీ నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని డిమాండ్ చేశారు.

# పరిగిలో ఏఐకేఎంఎస్ జిల్లా తొలి ఘనంగా మహాసభలు

- **రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై సమగ్ర చర్చ**
- **రైతు--కూలీ ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపు**

**పరిగి । ఆగస్టు 21 । నగర నిజం ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా తొలి మహాసభలు పరిగి నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు వై. మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మామిడాల భిక్షపతి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర




సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ తదితర సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినా రైతులు పండించిన పంటలకు తగిన ధర లభించడం లేదన్నారు. కౌలు రైతులకు సరైన గుర్తింపు లేకపోవడం, రుణభారం పెరగడం, రైతుల ఆత్మహత్యలు కొనసాగడం ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు.వ్యవసాయ కూలీల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందని భిక్షపతి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ఉపాధి హామీ చట్టం అమలు బలహీనపడటం, కనీస వేతనాలు అమలు కాకపోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలని, కనీస వేతనాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.అమెరికాతో సహా ఇతర దేశాలతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకుంటున్న విదేశీ వాణిజ్య ఒప్పందాలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# గణేష్ గుప్తాకు చిన్ననాటి స్నేహితుల అభినందనలు

- **కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపిన టెన్త్ క్లాస్ మిత్రులు**





**రాజేంద్రనగర్, ఆగస్టు 21 (నగరనిజం ప్రతినిధి):** గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ కి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ సర్పంచ్ ఆర్ గణేష్ గుప్తాకు ఆయన చిన్ననాటి స్నేహితులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సహచర క్లాస్మేట్ మిత్రులంతా గణేష్ గుప్తా నివాసానికి వెళ్లి కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో శంషాబాద్ కు చెందిన మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా శంషాబాద్ లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు గణేష్ గుప్తా జన్మదిన వేడుకలను పురస్కరించుకొని 1986-87 టెన్త్ క్లాస్ బ్యాచ్ స్నేహితులు వై.నరసింహ, బాబురావు ముదిరాజ్, చంద్రాచారి, రమేష్, వేణుగోపాల్, వెంకటేష్, రామకృష్ణారెడ్డి తదితరులు గణేష్ గుప్తా నివాసానికి వెళ్లి ఆయన చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. చిన్ననాటి స్నేహితులు జన్మదిన వేడుకల్లో పాల్గొని తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలపడం పట్ల గణేష్ గుప్తా ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన చిన్ననాటి మిత్రుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

# మంత్రి కొండా సురేఖ పై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం హాట్ కామెంట్స్




**హైద్రాబాద్ ఆగస్ట్ 21 ;**కొండా సురేఖ నియోజకవర్గం దాటితే ఆమెకు ఎవ్వరు ఓట్లు కూడా వేయరుకేటీఆర్, హరీష్ రావు ఎంకరేజ్ చేస్తేనే కొండా సురేఖ మాట్లాడుతుందితల్లి సురేఖ ,తండ్రి మురళి కలిసి సుస్మితతో మాట్లాడిస్తున్నారుసుస్మిత నీ బిడ్డ కదాఆస్థులన్ని బిడ్డకు ఇవ్వట్లేదా?Trs లో కొండా సురేఖ, మురళి ఏమి సంపాదించారో మాకు తెలుసు కాంగ్రెస్ పార్టీ కి కొండా సురేఖ చేసిన శ్రమ ఏంటి కొండా సురేఖ ఎప్పుడైనా పార్టీ కోసం జైల్ కు పోయిందా పక్క జియోజకవర్గంలో ఒక్క ఎమ్మెల్యేను గెలిపించావా సురేఖసుస్మిత పిల్ల కాదుఆమె అనుభవ శాసీఎం రేవంత్ రెడ్డి 24 గంటలు పార్టీ కోసం కష్ట పడ్డడుపార్టీని బ్రతికించాలని ఆలోచిస్తున్నారుకష్ట పడ్డ నాయకున్ని విమర్శిస్తారాపార్టీ కోసం కష్టపడ్డది పీసీసి అధ్యక్షుడు గా రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు,కోమటిరెడ్డి వెంకటరెడ్డి వీళ్లు అందరూ కష్ట పడితే కొండ సురేఖ పదవి అనుభవిస్తుందిఎన్నికల ముందు వరకు కొండా సురేఖ్ తీం లో ఉందిహై కమాండ్ కు లాయల్ గా ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారుకార్యకర్తలు శ్రమిస్తేనే కొండా సురేఖ గెలిచింది అని గుర్తుపెట్టుకోవాలిగెలిచి పార్టీకి కొండా సురేఖ చేసింది ఏంటిఎవరైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందేరేవంత్ రెడ్డి సోనియాగాంధీ ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆదేశాలతో నిద్ర పోకుండా రాష్ట్ర వ్యాప్తంగా తిరిగాడుగడీలను బద్దలు కొట్టిండు రేవంత్ రెడ్డి అని గుర్తించుకోవాలి.

# కొత్తపేటలో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు





**ఎల్బీనగర్, ఆగస్టు 21:** శ్రావణ శుక్రవారం సందర్భంగా కొత్తపేటలో బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి ఆధ్వర్యంలో ఆమె నివాసంలో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని వరలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన మహిళలకు వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానం ఉందన్నారు. కుటుంబ శ్రేయస్సు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కోసం మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో మహిళలు సామూహికంగా వ్రతం నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం సందర్భంగా కొత్తపేటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.





# నిజామాబాదు గ్రామంలో ఫ్రైడే డ్రైడే జ్వరపీడిత సర్వే కార్యక్రమం

**పాన్ గల్ ఆగస్టు 21 ( నగరనిజం)** శుక్రవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు నిజామాబాదు గ్రామ సర్పంచ్ మరాఠి లక్ష్మి వెంకట్, డిప్యూటీ సర్పంచ్ వరలక్ష్మి మదిలేటి, మరియు స్థానిక హెల్త్ అసిస్టెంట్స్ రామచందర్, సతీష్, మదన్ గోపాల్, వనపర్తి జిల్లా ఏఎల్ఓ టీమ్ సభ్యులు గంధం రాజు, గోపాల్ రెడ్డి, లక్ష్మన్, గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి దోమ లార్వ నియంత్రణ పద్ధతులు పాటించాలని తెలియచేస్తూ... ప్రతి శుక్రవారం, మరియు మంగళవారం డ్రైడే చేయాలనీ ప్రజలకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. వర్షాలు కురుస్తుండడంతో కీటక జనిత వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగాఉంటూ వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల ద్వారావ్యాప్తిచెందే జబ్బులపట్ల ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గునియా, ఫైలేరియా, మెదడువాపు వంటి విషజ్వరాల బారిన పడే ప్రమాదం పొంచి



ఉందని, అందుకే ఇంట్లోకి రాకుండా తలుపులు, కిటికీలకు దోమతెరలతో భద్రపరచాలని , ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడే పాటించాలని, గృహాల్లోఉండే పూలకుండీలు, పాతటైర్లు, పాతకూలర్లు, వాడి పడేసిన కొబ్బరిబొండాలు, రుబ్బురోళ్లు, ఖాళీప్లాస్టిక్ వస్తువులు, పాతకుండలు, పగిలినమట్టిచిప్పలు, ఎక్కడపడితే అక్కడ పడేయ రాదని, నిల్వ నీటితొట్లలోని పాత నీటినిపారపోయాలి. అప్పుడే దోమల సంతతిని నియంత్రించవచ్చు,నిల్వనీటిలో మరి యు నీటిగుంతల్లో లార్వ క్రిమిసంహారిణి అబ్బెట్ ద్రావనాన్ని వేయడంజరిగినది. కలుషితమైన నీటిని త్రాగితే విరేచనాలు,వాంతులు,కామెర్లు టైఫాయిడ్ వచ్చే ప్రమాదం ఉంది, త్రాగునీటిని వేడిచేసి చల్లారిన నీటిని తాగాలి,బయటి ఆహారం తినడాన్ని మానుకోవాలని, గాలి ద్వారా ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున జన సమర్థ ప్రదేశాలకు వెళ్ళకపోవడమే మేలు, జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, శరీర నొప్పులు, కండ్లకలక ఇతర ఫ్లూ వంటి లక్షణాలు ఉంటే వైద్యాధికారిని కాని వైద్య సిబ్బందిని కాని సంప్రదించాలని తెలియచేసినారు. ఈకార్యక్రమంలో ఆశ కార్యకర్తలు కవిత, చిన్నమ్మ, ప్రమీల, బ్రీడింగ్ చెక్కర్ గణేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# వరాలు ఇచ్చే వరలక్ష్మి తల్లి ఘనంగా వరలక్ష్మి సామూహిక వ్రతాలు



**మొయినాబాద్,ఆగస్ట్ 21 (నగర నిజం):** వరాలు ఇచ్చే వరలక్ష్మి దేవి పూజలను మహిళలు ఎంతో విశిష్టతతో నిర్వహించుకోవడం సాంప్రదాయం అని కనకమామిడి వెంకటేశ్వర స్వామి దేవాలయ వేదపండితులు నరేంద్రచార్యులు అన్నారు. శ్రావణమాసంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతానికి ఎంతో విశిష్టత ఉండడంతో మహిళలు పూజలు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని వారి వారి ఇళ్లల్లో నిర్వహించుకున్నారు. అదే విధంగా మండల పరిధిలోని కనకమామిడి గుట్టపై వెలిసిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరలక్ష్మి సామూహిక వ్రతాలను మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు, మహిళలు క్యూలో కూర్చోబెట్టి సాంప్రదాయబద్ధంగా జరిపించారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మీదేవిల గురించి మహిళల కు ఆయన క్లుప్తంగా వివరించారు. ధనాన్ని ప్రసాదించే తల్లి ధనలక్ష్మి, లౌకిక ఆధ్యాత్మిక విద్యావిజ్ఞానాన్ని ప్రసాదించే తల్లి విద్యాలక్ష్మి, పాడిపంటలు ప్రసాదించే తల్లి దాన్యలక్ష్మి, సాహసం ఓర్పు, సహనం, కార్యదీక్ష వీరత్వాన్ని ప్రసాదించే తల్లి దైర్య లక్ష్మి అని సకల కార్యవిద్య విజయాలను ప్రసాదించే తల్లి విజయలక్ష్మి, సంతానాన్ని ప్రసాదించే తల్లి సంతాన లక్ష్మి, పాలకులకు శౌర్యాన్ని, పరక్రమాన్ని ప్రసాదించే తల్లి వీరలక్ష్మి, రాజయోగం అధికారం, రాచరిక వైభవాలను ప్రసాదించే తల్లి గజలక్ష్మి అని అష్టలక్ష్మిల దేవిల గురించి మహిళలకు వివరించారు. శ్రావణమాసంలో చేసే వరలక్ష్మి చిత్రానికి ఎంతో విశిష్టత ఉంటుందన్నారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి దేవిని పూజిస్తారని తెలిపారు. వరలక్ష్మీదేవి మహిళల పాలిట కొంగుబంగారు పత్రం తర్వాత ముత్తైదువులను పిలిచి వాయిదం ఇవ్వడం ఆనవాయితీ అని తెలిపారు. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అష్టైశ్వెర్యాలు కలగడంతో పాటు పిల్లాపాపలు కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. వరలక్ష్మి వ్రతం ఆచరించడంతో భార్య భర్తల మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. ఇంటి ఇల్లాలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. సకల సౌభాగ్యాలు కలుగుతాయని అమ్మవారి కరుణకటాక్షం లభిస్తాయని, లక్ష్మీదేవి అనుగ్రహంతో అష్టైశ్వెర్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. కనకమామిడి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరలక్ష్మి వత్రాలు నిర్వహించడంతో వివిధ గ్రామాల నుంచి, ఆయా ప్రాంతాల నుంచి మహిళలు వేల సంఖ్యలో తరలిరావడంతో భక్తులతో కిటకిటలాడింది. సామూహిక లక్ష్మీదేవి వ్రతాల్లో మహిళలు క్యూలో కూర్చొని వేదపండితులు చెప్పిన విధంగా పూజలను నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం లక్ష్మీదేవి నామస్మరణతో మారుమోగింది. విచ్చేసిన భక్తులకు లక్ష్మీదేవి వ్రతం పూర్తైన అనంతరం అమ్మవారి దర్శనం, స్వామి వారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

## తూప్రాన్‌లో షట్టర్ లిఫ్టింగ్ దొంగతనం కేసు ఛేదన

- **సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి గుర్తింపు.. జైలులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**మెదక్ బ్యూరో : నగర నిజం : తూప్రాన్:** తూప్రాన్ పట్టణంలోని ప్రధాన రహదారులపై ఇటీవల జరిగిన రెండు షట్టర్ లిఫ్టింగ్ దొంగతనం కేసులను తూప్రాన్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా ఛేదించారు.ఫర్టిలైజర్ దుకాణం, చెప్పుల దుకాణంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి కందుల సత్యనారాయణను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతని ప్రస్తుత నివాసం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ కాగా, గతంలో విశాఖపట్నంలో నివసించినట్లు పోలీసులు తెలిపారు.సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు, అతను ఇతర ప్రాంతాల్లోనూ దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసులో అరెస్టై ప్రస్తుతం జైలులో ఉన్న నిందితుడిని తూప్రాన్ పోలీసులు గుర్తించారు.విచారణలో తూప్రాన్ పట్టణంలోని రెండు షట్టర్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.న్యాయస్థానం అనుమతితో నిందితుడిని శుక్రవారం నల్గొండ జైలు నుంచి మెదక్ కోర్టులో ప్రొడ్యూస్ చేయగా, కోర్టు ఆదేశాల మేరకు తిరిగి జైలుకు తరలించారు.నేరస్థులను గుర్తించి కేసులను ఛేదించడంలో తూప్రాన్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్ఐ గంగ రాజు తెలిపారు.

# జీవితం నేర్పిన గుణపాఠం

## సుకుమారంగా పెంచారు... కానీ జీవితాన్ని ఎదుర్కోవడం నేర్పలేదు







**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 21నగరనిజం :**ఒక చిన్న పల్లెటూరు. ఆ ఊరిలో రామయ్య, లక్ష్మమ్మ అనే దంపతులు ఉండేవారు. వారికి పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. కొద్దిపాటి పొలం ఉన్నా, పంట పండినప్పుడు రైతులు... పంట చేతికి రాకపోతే కూలీలు. తెల్లవారకముందే పొలానికి వెళ్లి, సాయంత్రం అలసిపోయి ఇంటికి తిరిగి వచ్చేవారు.వాళ్లు చదువుకోలేదు. కానీ తమ ఒక్క కొడుకు మాత్రం బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేయాలని కలలు కనేవారు."మేము పడిన కష్టాలు మా బిడ్డ పడకూడదు" అనేది వారి ఆలోచన.అందుకే చిన్నప్పటి నుంచే అతన్ని ఎంతో గారాబంగా పెంచారు. తాము పాత బట్టలు వేసుకున్నా, కొడుకుకు మాత్రం కొత్త బట్టలు. తాము ఎండలో నడిచినా, అతనికి ద్విచక్ర వాహనం. తాము చేతిలో సాధారణ ఫోన్ పెట్టుకున్నా, అతని చేతిలో ఖరీదైన స్మార్ట్‌ఫోన్."మా బిడ్డకు ఏ లోటూ ఉండకూడదు" అనుకున్నారు.కానీ ఒక విషయం మాత్రం మర్చిపోయారు.జీవితంలో కష్టాలు వచ్చినప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో అతనికి నేర్పలేదు.పదో తరగతికి వచ్చేసరికి అతని ప్రపంచం మారిపోయింది. చదువు కంటే ఫోన్, పుస్తకాల కంటే సోషల్ మీడియా, లక్ష్యాల కంటే తేలికగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలు ఎక్కువయ్యాయి.అతనికి ఒక స్నేహితుడు కూడా తోడయ్యాడు. ఇద్దరూ కలిసి సోషల్ మీడియాలో డబ్బు సంపాదించే మార్గాల గురించి వెతకడం ప్రారంభించారు."చదువుకుని ఉద్యోగం కోసం సంవత్సరాలు ఎదురు చూడాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో తెలివిగా చేస్తే త్వరగా డబ్బు సంపాదించవచ్చు" అని ఒకరినొకరు ప్రోత్సహించుకున్నారు.అలా మొదలైన ఆలోచన క్రమంగా ప్రమాదకరమైన దారిలోకి వెళ్లింది.ప్రిన్సిపాల్ ఇచ్చిన హెచ్చరికపాఠశాల ప్రిన్సిపాల్ రూపాదేవి విద్యార్థుల ప్రవర్తనను గమనించారు. తరగతిలో శ్రద్ధ తగ్గడం, ఫోన్ వినియోగం పెరగడం, చదువుపై నిర్లక్ష్యం ఆమెకు ఆందోళన కలిగించింది.ఒకరోజు వారిని పిలిచి,"మీ వయసు జీవితాన్ని నిర్మించుకునే వయసు. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి విషయం నిజం కాదు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశలో పడకండి. మీ తల్లిదండ్రులు మీ కోసం రక్తం చెమటగా మార్చి సంపాదిస్తున్నారు. వారి కష్టాన్ని గుర్తుంచుకోండి" అని గట్టిగా మందలించారు.తల్లిదండ్రులను కూడా పిలిపించి పిల్లల ప్రవర్తన గురించి వివరించారు.ఆ హెచ్చరికను విద్యార్థులు తమ మంచికోసం ఇచ్చిన మాటగా తీసుకోకుండా, తమపై అవమానంగా భావించారు.అక్కడి నుంచే పరిస్థితి మరింత విషమించింది.ఆ దురదృష్టకరమైన రోజుకొంతకాలానికి ప్రిన్సిపాల్‌పై కోపం పెంచుకున్న ఆ ఇద్దరు విద్యార్థులు ఆమెను భయపెట్టాలని, ప్రతీకారం తీర్చుకోవాలని ముందుగానే ఆలోచనలు చేసుకున్నట్లు తరువాత పోలీసుల విచారణలో బయటపడింది.అది కేవలం క్షణిక కోపం కాదు.ముందుగానే మాట్లాడుకున్నారు.ఎప్పుడు వెళ్లాలి, ఎలా వెళ్లాలి అనే విషయాలపై ఆలోచించారు.విషయం చివరకు ఘోరమైన నేరానికి దారితీసింది. అంతేకాకుండా, ఇంట్లో ఉన్న సుమారు ?2,10,000 నగదు కూడా తీసుకెళ్లారు.తర్వాత ఇద్దరూ ఏమీ తెలియనట్టుగా సాధారణంగా ద్విచక్రవాహనంపై తిరుగుతూ, ఖరీదైన సెల్‌ఫోన్‌తో ఆమెను చూడడానికి వచ్చినట్టుగా ప్రవర్తించారు.కానీ నేరం చేసిన మనసు ఎంత నటించినా...ఆధారాల ముందు ఎక్కువకాలం దాగలేదు.పోలీసుల విచారణసంఘటన గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు.మొదట సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ కనిపించిన వస్తువులు, వచ్చిన వ్యక్తుల వివరాలు, పరిసరాల్లోని సమాచారాన్ని సేకరించారు.తర్వాత కుటుంబ సభ్యులను, పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను ఒక్కొక్కరి ని ప్రశ్నించారు."ఇటీవల ఆమెతో ఎవరైనా గొడవపడ్డారా?""ఎవరైనా బెదిరించారా?""ఆమె ఎవరినైనా మందలించారా?"అని వివరాలు సేకరించారు.విద్యార్థుల ప్రవర్తనలో వచ్చిన మార్పులు కూడా పోలీసుల దృష్టికి వచ్చాయి.ఆ ఇద్దరు విద్యార్థులు సంఘటన తర్వాత కూడా ఎలాంటి భయం లేనట్టుగా ఖరీదైన సెల్‌ఫోన్‌తో, ద్విచక్రవాహనంపై అక్కడికి రావడం పోలీసులకు అనుమానాన్ని కలిగించింది.వారి కదలికలు, ఫోన్‌కు సంబంధించిన సమాచారాన్ని చట్టబద్ధమైన విధానాల్లో పరిశీలించారు. డబ్బు తీసుకెళ్లిన విషయం కూడా దర్యాప్తులో కీలకంగా మారింది.మొదట ఇద్దరూ,"మాకు ఏమీ తెలియదు. మేము ఆమెను చూడడానికి మాత్రమే వచ్చాం" అని చెప్పారు.పోలీసులు మాత్రం ప్రశాంతంగా ఒక్కో విషయాన్ని అడుగుతూ ముందుకు వెళ్లారు."మీరు చెప్పిన మాటలకు, మాకు లభించిన ఆధారాలకు పొంతన లేదు. నిజం చెప్పడం మీకే మంచిది. కోపంలో చేసిన తప్పును దాచిపెడితే అది మరింత పెద్ద సమస్యగా మారుతుంది" అని గట్టిగా హెచ్చరించారు.విచారణలో వారి మాటల్లో పొంతనలేమి బయటపడింది.చివరకు పోలీసుల ముందు అసలు విషయాన్ని వెల్లడించారు.ఇది ఒక్కరోజులో జరిగిన ఆలోచన కాదని, ముందుగానే మాట్లాడుకుని చేసిన పని అని దర్యాప్తులో తేలింది.ఆ విషయం విన్న తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు."మా పిల్లవాడు ఇంత దూరం వెళ్లాడా?" అని తల్లి కన్నీళ్లతో విలపించింది.తండ్రి తల పట్టుకుని,"మా బిడ్డకు కష్టం రాకూడదని అనుకున్నాం. కానీ కష్టాన్ని ఎదుర్కొనే బలం ఇవ్వలేదు. కోరినది ఇచ్చాం... కానీ ఏది మంచిదో, ఏది చెడ్డదో గుర్తించే వివేకం నేర్పలేదు" అన్నాడు.పోలీసుల మాటపోలీసు అధికారి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఇలా అన్నారు:"పిల్లల తప్పుకు కేవలం పిల్లలనే నిందించడం సరిపోదు. ఇంట్లో పెంపకం, స్నేహితుల ప్రభావం, సోషల్ మీడియా వినియోగం, పాఠశాల పర్యవేక్షణ – ఇవన్నీ కలిసి ప్రభావం చూపుతాయి.పిల్లలను అనుమానించడం పరిష్కారం కాదు. వారితో ప్రతిరోజూ మాట్లాడాలి. వాళ్లు ఏం చూస్తున్నారు? ఎవరితో స్నేహం చేస్తున్నారు? ఏం ఆలోచిస్తున్నారు? వారి మనసులో ఏ మార్పులు వస్తున్నాయి? తెలుసుకోవాలి."సొల్యూషన్ ఏమిటి?ఈ సంఘటన తర్వాత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులకు ఐదు విషయాలు స్పష్టంగా చెప్పారు:1. సోషల్ మీడియాకు సమయ పరిమితి పెట్టుకోవాలి. 2. "సులభంగా, త్వరగా డబ్బు సంపాదించండి" అనే ఆన్‌లైన్ మాటలను గుడ్డిగా నమ్మకూడదు. 3. ఉపాధ్యాయుల మందలింపును శత్రుత్వంగా భావించకూడదు. 4. తల్లిదండ్రులు పిల్లలను అతిగా గారాబం చేయకుండా, చిన్న చిన్న బాధ్యతలు అప్పగించాలి. 5. కోపం వచ్చినప్పుడు వెంటనే నిర్ణయం తీసుకోకుండా, నమ్మకమైన పెద్దవారితో మాట్లాడాలి.పాఠశాలలో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేశారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో ప్రతిరోజూ కనీసం కొంత సమయం ఫోన్ పక్కన పెట్టి మాట్లాడాలని నిర్ణయించుకున్నారు.చివరి సందేశంఆ రోజు రామయ్య తన కొడుకు చిన్నప్పటి ఫోటోను చేతిలో పట్టుకుని చాలాసేపు ఏడ్చాడు."ఈ చేతులు ఎప్పుడూ మట్టిని తాకకూడదని అనుకున్నాను. కానీ జీవితపు విలువను మాత్రం నేర్పాల్సింది నేనే. మేము కష్టపడిన జీవితాన్ని వాడికి ఇవ్వకూడదనుకున్నాం. అదే మా తప్పు. కష్టం తప్పించటం కాదు... కష్టాన్ని ఎదుర్కొనేలా చేయడమే నిజమైన పెంపకం."ఈ కథ మనందరికీ ఒక ప్రశ్న వేస్తుంది:పిల్లలకు మనం ఏమి ఇస్తున్నాం ఖరీదైన ఫోన్‌నాద్విచక్రవాహన మాడబ్బా సౌకర్యాలా అవన్నీ ఇవ్వొచ్చు.కానీ వాటికంటే ముందు ఇవ్వాల్సింది–బాధ్యత.క్రమశిక్షణ.ఓర్పు.మంచి స్నేహాల విలువ.తల్లిదండ్రుల పట్ల గౌరవం.ఉపాధ్యాయుల పట్ల గౌరవం.ముఖ్యంగా... మానవత్వం.పిల్లలకు కష్టాలు రాకుండా కాపాడటం ప్రేమ.కష్టాలు వచ్చినప్పుడు నిలబడటం నేర్పడం బాధ్యత.తప్పు చేసినప్పుడు సరిదిద్దడం తల్లిదండ్రుల ధర్మం.మంచి దారిలో నడిపించడం సమాజం మొత్తం బాధ్యత.సుకుమారంగా పెంచండి... కానీ బలహీనంగా కాదు.స్వేచ్ఛ ఇవ్వండి... కానీ బాధ్యత లేకుండా కాదు.ఫోన్ ఇవ్వండి... కానీ ఫోన్‌కు బానిసలుగా మాత్రం చేయకండి.ఎందుకంటే...ఒక చిన్న నిర్లక్ష్యం ఒక జీవితాన్ని మార్చగలదు.లఒక మంచి మాట ఒక జీవితాన్ని కాపాడగలదు.రచన డాక్టర్ పున్న విజయలక్ష్మి జెల్ తెలుగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల సి ఓ ఈ (బాలికలు) కొత్తగడి ,వికారాబాద్

# రాయదుర్గం భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ



**న్యూఢిల్లీ:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. భూముల వేలాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టులోనే తేల్చుకోవాలని చెప్పింది.కాగా, రాయదుర్గం భూముల వేలాన్ని అడ్డుకోలేమని ఇప్పటికే తెలంగాణ హైకోర్టు చెప్పిన విషయం తెలిసిందే. ఆ భూముల వేలానికి సంబంధించి బిడ్లు ఇప్పటివరకు అందలేదని, దీంతో కొన్ని రోజులు వాయిదా వేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది హైకోర్టును కోరారు. అయితే, అందుకు హైకోర్టు నిరాకరించింది. భూ సంస్కరణల ట్రిబ్యునల్ ఎదుట ఎటువంటి విచారణ లేదా పునర్వి చారణ ప్రక్రియ పెండింగ్‌లో లేనప్పుడు మధ్యంతర ఉత్తర్వులతో సర్కారు నిర్ణయాన్ని ఆపలేమని స్పష్టం చేసింది. సర్వే నంబర్ 83లో 11.12 ఎకరాల భూ వివాదంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 27కు హైకోర్టు వాయిదా వేసింది.

# విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**





**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21 నగర నిజం :** వికారాబాద్ జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు, ఆధార్ అనుసంధానం, ఆఫర్ జనరేషన్ మరియు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గారు మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నమోదు/ అనుసంధానం, ఆఫర్ జనరేషన్ మరియు ప్రగతిని సమీక్షించారు.ప్రతి మండల విద్యాశాఖాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ముఖ్యంగా ప్రీ-ప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న ఆధార్ మరియు ఆఫర్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు.వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా, విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని MEOలకు సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి (వీజూ) ప్రతి నెల తప్పనిసరిగా కనీసం 15 పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, FLN ప్రగతి మరియు ఇతర అకాడమిక్ అంశాలను సమగ్రంగా పరిశీలించాలని, పాఠశాలలను సందర్శించిన సందర్భంగా అకాడమిక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన సూచనలు, సమస్యలు మరియు నిర్దేశించిన చర్యలు తదుపరి సందర్శన సమయంలో అమలు అయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను పరిశీలించి, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# చైతన్యపురిలో ఘనంగా తొట్టెల కార్యక్రమం









- **ముఖ్యఅతిథిగా: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి**

**ఎల్బీనగర్, ఆగస్టు 21:** బోనాల పండుగను పురస్కరించుకుని చైతన్యపురిలో చిన్న గౌడ్ ఆధ్వర్యంలో తొట్టెల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తొట్టెలను సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తొట్టెల కార్యక్రమంతో చైతన్యపురిలో పండుగ సందడి నెలకొంది. డప్పు వాయిద్యాలు, భక్తుల నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, యువత, భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



# జిల్లాలో ఉల్లి సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం





**● ఎకరాకు రూ.8 వేల సబ్సిడీ.. ఉల్లి నిల్వ నిర్మాణానికి రూ.లక్ష సాయం**

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, (నగర నిజం) : వికారాబాద్ జిల్లాలో ఉల్లి సాగుకు అనుకూల వాతావరణం, నేలలు ఉన్నందున రైతులు ఉల్లి సాగును చేపట్టి అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ. సత్తార్ సూచించారు. ఉల్లి సాగును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎకరాకు రూ.8 వేల సబ్సిడీ అందిస్తోందని తెలిపారు.

**● ఉల్లి సాగుకు అనుకూల నేలలు**

మంచి నీటి పారుదల కలిగిన ఎర్ర నేలలు, ఇసుక లోమి నేలలు, లోమి నేలలు ఉల్లి సాగుకు అనుకూలంగా ఉంటాయని అధికారులు తెలిపారు. నీరు నిలిచే నేలలను నివారించాలని సూచించారు. నేల పీహెచ్ విలువ 6.5 నుంచి 7.5 మధ్య ఉంటే ఉల్లి సాగుకు అనుకూలమని పేర్కొన్నారు.

**● విత్తన మోతాదు**

ఎకరాకు సుమారు 4 నుంచి 5 కిలోల నాణ్యమైన ఉల్లి విత్తనం అవసరమవుతుంది. ప్రాంతం, సాగు రకం, నారు పెంపకం పద్ధతిని బట్టి విత్తన మోతాదులో స్వల్ప మార్పులు ఉండవచ్చని తెలిపారు.

**● నారు మడి నిర్వహణపై సూచనలు**

ఎంపిక చేసిన భూమిలో నీరు నిల్వ ఉండకుండా ఎత్తైన నారు మడులను ఏర్పాటు చేసుకోవాలి. బాగా కుళ్లిన పశువుల ఎరువును కలిపి నేలను మెత్తగా తయారు చేసి విత్తనాలను పలుచగా విత్తాలి. నారు మడికి అవసరమైనంత నీటిని అందిస్తూ కలుపు మొక్కలను తొలగించాలి. అధిక తేమ వల్ల తెగుళ్లు సోకకుండా సరైన నీటి పారుదల ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. సాధారణంగా 45 నుంచి 50 రోజుల వయస్సు కలిగిన ఆరోగ్యకరమైన నారును ప్రధాన పొలంలో నాటుకోవచ్చని తెలిపారు.

**● ప్రధాన పొలంలో నాటే విధానం**

ప్రధాన పొలాన్ని బాగా దున్ని మెత్తగా తయారు చేసి అవసరమైన సేంద్రియ ఎరువులను వినియోగించాలి. వరుసల మధ్య సుమారు 15 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల దూరం పాటిస్తూ నాటుకోవాలి. బిందు సేద్యం ద్వారా అవసరమైన మేరకు నీటిని అందించడం వల్ల నీటి వినియోగ సామర్థ్యం పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

**● ఎకరాకు 80 నుంచి 120 క్వింటాళ్ల దిగుబడి**

సమతుల్య ఎరువుల వినియోగం, సరైన నీటి యాజమాన్యం, కలుపు మొక్కలు, కీటకాలు, తెగుళ్ల నియంత్రణ వంటి శాస్త్రీయ పద్ధతులను పాటిస్తే ఎకరాకు సుమారు 80 నుంచి 120 క్వింటాళ్ల వరకు ఉల్లి దిగుబడి పొందే అవకాశం ఉందని ఎం.ఏ. సత్తార్ తెలిపారు. అయితే వాతావరణ పరిస్థితులు, ఉల్లి రకం, నేల స్వభావం, సాగు పద్ధతులను బట్టి దిగుబడిలో మార్పులు ఉండవచ్చని వివరించారు.

**● ఉల్లి నిల్వ నిర్మాణానికి రూ.లక్ష సబ్సిడీ**

ఉల్లి పంటలో రైతులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో మార్కెట్ ధరల హెచ్చుతగ్గులు ఒకటని అధికారులు తెలిపారు. కోత సమయంలో ధరలు తక్కువగా ఉన్నప్పుడు పంటను వెంటనే విక్రయించకుండా శాస్త్రీయంగా నిర్మించిన ఉల్లి నిల్వ కేంద్రాల్లో నిల్వ చేసుకోవడం ద్వారా ధరలు పెరిగిన సమయంలో విక్రయించి అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు.ఉల్లి నిల్వ నిర్మాణాలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం 25 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన ఒక్కో యూనిట్‌కు రూ.1 లక్ష సబ్సిడీ అందిస్తోందని తెలిపారు.

**● నిల్వతో పంట అనంతర నష్టాలు తగ్గింపు**

ఉల్లిని సరైన గాలి ప్రసరణ కలిగిన నిల్వ నిర్మాణంలో ఉంచడం ద్వారా కుళ్లిపోవడం, మొలకెత్తడం, నిల్వ నష్టాలను తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. మార్కెట్ ధరలు తక్కువగా ఉన్న సమయంలో పంటను నిల్వ చేసుకుని ధరలు పెరిగినప్పుడు దశలవారీగా విక్రయించడం ద్వారా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు.

**● సాగు సబ్సిడీకి ఆగస్టు 29 వరకు దరఖాస్తులు**

ఉల్లి సాగు చేస్తున్న అర్హత కలిగిన రైతులు ప్రభుత్వం అందిస్తున్న ఎకరాకు రూ.8 వేల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ. సత్తార్ కోరారు.

**● దరఖాస్తుకు అవసరమైన పత్రాలు:**

పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్
ఆధార్ కార్డు జిరాక్స్
బ్యాంకు ఖాతా వివరాలు లేదా బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్
పాస్‌పోర్టు సైజు ఫొటో

దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఆగస్టు 29, 2026 అని తెలిపారు. రైతులు నిర్ణీత గడువులోగా సంబంధిత ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**● గత ఏడాది సబ్సిడీ పొందిన వారికి అవకాశం లేదు**

గత సంవత్సరం ఉల్లి సాగుకు సబ్సిడీ పొందిన లేదా సబ్సిడీ కోసం దావా చేసిన రైతులు ఈ సంవత్సరం మళ్లీ ఉల్లి సాగు సబ్సిడీ పొందేందుకు అర్హులు కారని అధికారులు స్పష్టం చేశారు. కొత్తగా అర్హత కలిగిన రైతులు మాత్రమే నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉల్లి సాగు సబ్సిడీతో పాటు నిల్వ నిర్మాణానికి లభించే సబ్సిడీని కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలని, తక్కువ ధరలకు పంటను విక్రయించకుండా శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేసి మంచి ధర వచ్చిన సమయంలో మార్కెట్‌కు తరలించడం ద్వారా అధిక ఆదాయం పొందాలని ఎం.ఏ. సత్తార్ కోరారు.

# వరాలు ఇచ్చే వరలక్ష్మి తల్లి ఘనంగా వరలక్ష్మి సామూహిక వ్రతాలు



మొయినాబాద్,ఆగస్ట్ 21 (నగర నిజం): వరాలు ఇచ్చే వరలక్ష్మి దేవి పూజలను మహిళలు ఎంతో విశిష్టతతో నిర్వహించుకోవడం సాంప్రదాయం అని కనకమామిడి వెంకటేశ్వర స్వామి దేవాలయ వేదపండితులు నరేంద్రచార్యులు అన్నారు. శ్రావణమాసంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతానికి ఎంతో విశిష్టత ఉండడంతో మహిళలు పూజలు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని వారి వారి ఇళ్లల్లో నిర్వహించుకున్నారు. అదే విధంగా మండల పరిధిలోని కనకమామిడి గుట్టపై వెలిసిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరలక్ష్మి సామూహిక వ్రతాలను మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదపండితులు, మహిళలు క్యూలో కూర్చోబెట్టి సాంప్రదాయబద్ధంగా జరిపించారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మీదేవిల గురించి మహిళలకు ఆయన క్లుప్తంగా వివరించారు. ధనాన్ని ప్రసాదించే తల్లి ధనలక్ష్మి, లౌకిక ఆధ్యాత్మిక విద్యావిజ్ఞానాన్ని ప్రసాదించే తల్లి విద్యాలక్ష్మి, పాడిపంటలు ప్రసాదించే తల్లి దాన్యలక్ష్మి, సాహసం ఓర్పు, సహనం, కార్యదీక్ష వీరత్వాన్ని ప్రసాదించే తల్లి ధైర్య లక్ష్మి అని సకల కార్యవిద్య విజయాలను ప్రసాదించే తల్లి విజయలక్ష్మి, సంతానాన్ని ప్రసాదించే తల్లి సంతాన లక్ష్మి, పాలకులకు శౌర్యాన్ని, పరాక్రమాన్ని ప్రసాదించే తల్లి వీరలక్ష్మి, రాజయోగం అధికారం, రాచరిక వైభవాలను ప్రసాదించే తల్లి గజలక్ష్మి అని అష్టలక్ష్మిల దేవిల గురించి మహిళలకు వివరించారు. శ్రావణమాసంలో చేసే వరలక్ష్మి చిత్రానికి ఎంతో విశిష్టత ఉంటుందన్నారు. శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి దేవిని పూజిస్తారని తెలిపారు. వరలక్ష్మీదేవి మహిళల పాలిట కొంగుబంగారు పత్రం తర్వాత ముత్తైదువులను పిలిచి వాయిదం ఇవ్వడం ఆనవాయితీ అని తెలిపారు. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అష్టైశ్వర్యాలు కలగడంతో పాటు పిల్లాపాపలు కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. వరలక్ష్మి వ్రతం ఆచరించడంతో భార్య భర్తల మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. ఇంటి ఇల్లాలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. సకల సౌభాగ్యాలు కలుగుతాయని అమ్మవారి కరుణకటాక్షం లభిస్తాయని, లక్ష్మీదేవి అనుగ్రహంతో అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని తెలిపారు. కనకమామిడి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరలక్ష్మి వత్రాలు నిర్వహించడంతో వివిధ గ్రామాల నుంచి, ఆయా ప్రాంతాల నుంచి మహిళలు వేల సంఖ్యలో తరలిరావడంతో భక్తులతో కిటకిటలాడింది. సామూహిక లక్ష్మీదేవి వ్రతాల్లో మహిళలు క్యూలో కూర్చోని వేదపండితులు చెప్పిన విధంగా పూజలను నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం లక్ష్మీదేవి నామస్మరణతో మారుమోగింది. విచ్చేసిన భక్తులకు లక్ష్మీదేవి వ్రతం పూర్తైన అనంతరం అమ్మవారి దర్శనం, స్వామి వారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పరిగిలో ఏఐకేఎంఎస్ జిల్లా తొలి ఘనంగా మహాసభలు

**● రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై సమగ్ర చర్చ**

**● రైతు--కూలీ ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపు**




పరిగి ,ఆగస్టు 21, నగర నిజం ప్రతినిధి..వికారాబాద్ జిల్లా అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా తొలి మహాసభలు పరిగి నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు వై. మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మామిడాల భిక్షపతి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్, విద్యుత్ తదితర సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినా రైతులు పండించిన పంటలకు తగిన ధర లభించడం లేదన్నారు. కౌలు రైతులకు సరైన గుర్తింపు లేకపోవడం, రుణభారం పెరగడం, రైతుల ఆత్మహత్యలు కొనసాగడం ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు.వ్యవసాయ కూలీల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారిందని భిక్షపతి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ఉపాధి హామీ చట్టం అమలు బలహీనపడటం, కనీస వేతనాలు అమలు కాకపోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలని, కనీస వేతనాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.అమెరికాతో సహా ఇతర దేశాలతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకుంటున్న విదేశీ వాణిజ్య ఒప్పందాలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగవంతం చేయాలి

**● జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 21 నగర నిజం : వికారాబాద్ జిల్లాలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడంతో పాటు, ఆధార్ అనుసంధానం, ఆఫర్ జనరేషన్ మరియు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గారు మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని మండలాల మండల విద్యాశాఖాధికారులతో విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆధార్ నమోదు/అనుసంధానం, ఆఫర్ జనరేషన్ మరియు ప్రగతిని సమీక్షించారు.ప్రతి మండల విద్యాశాఖాధికారికి నిర్దిష్ట లక్ష్యాలను కేటాయించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ముఖ్యంగా ప్రీ-ప్రైమరీ తరగతుల ఎన్‌రోల్‌మెంట్‌తో పాటు 1వ తరగతి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.విద్యార్థుల నమోదు ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న ఆధార్ మరియు ఆఫర్ జనరేషన్ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, సంబంధిత ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు.వికారాబాద్ జిల్లాను విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌లో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపే విధంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. అదేవిధంగా, విద్యార్థుల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ సామర్థ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వీజూలకు సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా పాఠశాల స్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండల విద్యాధికారి (వీజూ) ప్రతి నెల తప్పనిసరిగా కనీసం 15 పాఠశాలలను సందర్శించి, పాఠశాలల్లో విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఖీచీ ప్రగతి మరియు ఇతర అకాడమిక్ అంశాలను సమగ్రంగా పరిశీలించాలని, పాఠశాలలను సందర్శించిన సందర్భంగా అకాడమిక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన సూచనలు, సమస్యలు మరియు నిర్దేశించిన చర్యలు తదుపరి సందర్శన సమయంలో అమలు అయ్యాయా లేదా అనే అంశాన్ని తప్పనిసరిగా సమీక్షించాలని సూచించారు. గత సందర్శనలో సూచించిన అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తీసుకున్న చర్యలను పరిశీలించి, పెండింగ్ అంశాలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై ప్రతిరోజూ ప్రగతిని సమీక్షిస్తూ, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# నిజామాబాదు గ్రామంలో ఫ్రైడే డ్రైడే జ్వరపీడిత సర్వే కార్యక్రమం







పాన్‌గల్ ఆగస్టు 21 ( నగరనిజం) శుక్రవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు నిజామాబాదు గ్రామ సర్పంచ్ మరాఠి లక్ష్మి వెంకట్, డిప్యూటీ సర్పంచ్ వరలక్ష్మి మదిలేటి, మరియు స్థానిక హెల్త్ అసిస్టెంట్స్ రామచందర్, సతీష్, మదన్ గోపాల్, వనపర్తి జిల్లా ఏఎల్ఓ టీమ్ సభ్యులు గంధం రాజు, గోపాల్ రెడ్డి, లక్ష్మన్, గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి దోమ లార్వ నియంత్రణ పద్ధతులు పాటించాలని తెలియచేస్తూ... ప్రతి శుక్రవారం, మరియు మంగళవారం డ్రైడే చేయాలనీ ప్రజలకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. వర్షాలు కురుస్తుండడంతో కీటక జనిత వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగాఉంటూ వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. దోమల ద్వారావ్యాప్తిచెందే జబ్బులపట్ల ఏవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గునియా, ఫైలేరియా, మెదడువాపు వంటి విషజ్వరాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని, అందుకే ఇంట్లోకి రాకుండా తలుపులు, కిటికీలకు దోమతెరలతో భద్రపరచాలని , ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడే పాటించాలని, గృహాల్లోఉండే పూలకుండీలు, పాతటైర్లు, పాతకూలర్లు, వాడి పడేసిన కొబ్బరిబొండాలు, రుబ్బురోళ్లు, ఖాళీప్లాస్టిక్ వస్తువులు, పాతకుండలు, పగిలినమట్టిచిప్పలు, ఎక్కడపడితే అక్కడ పడేయ రాదని, నిల్వ నీటితొట్లలోని పాత నీటినిపారపోయాలి. అప్పుడే దోమల సంతతిని నియంత్రించవచ్చు,నిల్వనీటిలో మరియు నీటిగుంతల్లో లార్వ క్రిమిసంహారిణి అబ్బెట్ ద్రావనాన్ని వేయడంజరిగినది. కలుషితమైన నీటిని త్రాగితే విరేచనాలు,వాంతులు,కామెర్లు టైఫాయిడ్ వచ్చే ప్రమాదం ఉంది, త్రాగునీటిని వేడిచేసి చల్లారిన నీటిని తాగాలి,బయటి ఆహారం తినడాన్ని మానుకోవాలని, గాలి ద్వారా ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున జన సమర్థ ప్రదేశాలకు వెళ్ళకపోవడమే మేలు, జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, శరీర నొప్పులు, కండ్లకలక ఇతర ఫ్లూ వంటి లక్షణాలు ఉంటే వైద్యాధికారిని కాని వైద్య సిబ్బందిని కాని సంప్రదించాలని తెలియచేసినారు. ఈకార్యక్రమంలో ఆశ కార్యకర్తలు కవిత, చిన్నమ్మ, ప్రమీల, బ్రీడింగ్ చెక్కర్ గణేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చైతన్యపురిలో ఘనంగా తొట్టెల కార్యక్రమం

**● ముఖ్యఅతిథిగా: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి**



ఎల్బీనగర్, ఆగస్టు 21: బోనాల పండుగను పురస్కరించుకుని చైతన్యపురిలో చిన్న గౌడ్ ఆధ్వర్యంలో తొట్టెల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తొట్టెలను సమర్పించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తొట్టెల కార్యక్రమంతో చైతన్యపురిలో పండుగ సందడి నెలకొంది. డప్పు వాయిద్యాలు, భక్తుల నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో స్థానిక నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, మహిళలు, యువత, భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

# తూప్రాన్‌లో షట్టర్ లిఫ్టింగ్ దొంగతనం కేసు ఛేదన

- సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి గుర్తింపు.. జైలులో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



మెదక్ బ్యూరో : నగర నిజం : తూప్రాన్: తూప్రాన్ పట్టణంలోని ప్రధాన రహదారులపై ఇటీవల జరిగిన రెండు షట్టర్ లిఫ్టింగ్ దొంగతనం కేసులను తూప్రాన్ పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా ఛేదించారు. ఫర్టిలైజర్ దుకాణం, చెప్పుల దుకాణంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి కందుల సత్యనారాయణను నిందితుడిగా పోలీసులు గుర్తించారు. అతని ప్రస్తుత నివాసం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ కాగా, గతంలో విశాఖపట్నంలో నివసించినట్లు పోలీసులు తెలిపారు.సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు, అతను ఇతర ప్రాంతాల్లోనూ దొంగతనాలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించారు. నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసులో అరెస్టై ప్రస్తుతం జైలులో ఉన్న నిందితుడిని తూప్రాన్ పోలీసులు గుర్తించారు.విచారణలో తూప్రాన్ పట్టణంలోని రెండు షట్టర్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.న్యాయస్థానం అనుమతితో నిందితుడిని శుక్రవారం నల్గొండ జైలు నుంచి మెదక్ కోర్టులో ప్రొడ్యూస్ చేయగా, కోర్టు ఆదేశాల మేరకు తిరిగి జైలుకు తరలించారునేరస్థులను గుర్తించి కేసులను ఛేదించడంలో తూప్రాన్ పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్ఐ గంగ రాజు తెలిపారు.

# కొత్తపేటలో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు





ఎల్బీనగర్, ఆగస్టు 21: శ్రావణ శుక్రవారం సందర్భంగా కొత్తపేటలో బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి ఆధ్వర్యంలో ఆమె నివాసంలో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని వరలక్ష్మీ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన మహిళలకు వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బద్దం సృజన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానం ఉందన్నారు. కుటుంబ శ్రేయస్సు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కోసం మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పూజా కార్యక్రమంలో మహిళలు సామూహికంగా వ్రతం నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమం సందర్భంగా కొత్తపేటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.





# ప్రశాంతంగా ముగిసిన పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు

- పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,



వికారాబాద్ జిల్లా ప్రతిని ఆగస్టు 21 నగర నిజం : వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ సబ్ డివిజన్‌లలో జిల్లా పోలీస్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించబడ్డాయి. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా డీపీవో లో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించి, ఎన్నికల ఏర్పాట్లు మరియు నిర్వహణ తీరుపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ సిబ్బంది సంక్షేమం,వారి సమస్యల పరిష్కారం మరియు వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో భాగంగా 50 మంది పురుష పోలీస్ సిబ్బందికి ఒక ప్రతినిధిని, 40 మంది మహిళా సిబ్బంది కలసి ఒక ప్రతినిధి ని ఎన్నుకుంటారు. అనంతరం ఎన్నికైన ప్రతినిధులందరూ కలిసి జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకుంటారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా డి సి ఆర్ బి డీస్పీ జనయ్య; డీటీసీ డీస్పీ శ్రీనివాస్; డిఎస్ బి ఇన్‌స్పెక్టర్లు నాగార్జున, జములప్ప; ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వము పండుగ ఎ సాయన్న ముదిరాజ్ జయంతి

- తెలంగాణ ప్రభుత్వము పండుగ సాయన్న ముదిరాజ్ గారి జయంతి మరియు వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తూ, ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.



(ఆగస్టు 21 వికారాబాద్ జిల్లా ప్రతినిధి ) తెలంగాణ ప్రభుత్వం సామాజిక విప్లవకారుడు, పేదల పెన్నిధి, పేద ప్రజలకు సామూహిక వివాహాలు నిర్వహించిన మహానుభావుడు, ఆకలితో అలమటిస్తున్న ప్రజల ఆకలి తీర్చడానికి ఊరురా పండగలను నిర్వహించిన మహానుభావుడు, దేశంలో స్వాతంత్ర పోరాటానికి సమాంతరంగా హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పనిచేసిన యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమాన్ని అక్టోబర్ 22 మరియు వర్ధంతి కార్యక్రమాన్ని డిసెంబర్ 10న అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నాం అదేవిధంగా ఈ ప్రభుత్వ నిర్ణయానికి కృషిచేసిన మంత్రివర్యులు వాకిటి శ్రీహరి గారికి, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గారికి మరియు ముదిరాజ్ పెద్దలందరికీ పేరుపేరునా ధన్యవాదముల అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వము తెలంగాణలో అత్యధిక జనాభాతో ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా విద్యాపరంగావెనుకబడి ఉన్నటువంటి ముదిరాజులకు విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని అదేవిధంగా గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం +ూ. చీశీ 15 ఇచ్చి కొంతకాలం అమలు చేసి ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ఎన్నికల సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సందర్భంగా ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏకు మార్చిన జీవో నెంబర్ 15 ను అమలు చేస్తామని చెప్పిన విధంగా త్వరలోనే అమలు చేయాలని కోరుతున్నాం.

# భారత ఆర్థిక ప్రగతిలో ఎంఎస్ఎంఈల పాత్ర కీలకం

- వ్యాపార నిరంతరతకు ఆరోగ్య బీమా ఎంతో అవసరం: స్టార్ హెల్త్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ కేబీబీ







హైదరాబాద్ । ఆగస్టు 21 । నగర నిజం ప్రతినిధి..భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో పెద్ద సంస్థలతో పాటు లక్షలాది మంది పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వృత్తి నిపుణులు, ఉద్యోగ కుటుంబాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ కేబీబీ అన్నారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించిన 'లీడర్స్ ఆఫ్ టుమారో -- ఎమర్జింగ్ బిజినెస్, ది ఇండియా అడ్వాంటేజ్' కార్యక్రమంలో ప్యానెలిస్ట్‌గా పాల్గొన్న ఆయన భారతదేశ వృద్ధి అవకాశాలు, ఎంఎస్ఎంఈ రంగం ప్రాధాన్యత, ఆరోగ్య రక్షణ అవసరాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.భారతదేశ అభివృద్ధి కథను కేవలం భారీ కార్పొరేట్ సంస్థలు మాత్రమే ముందుకు తీసుకెళ్లడం లేదని, దేశవ్యాప్తంగా ప్రతిరోజూ తమ వ్యాపారాలను నిర్మించుకుంటూ, ఉద్యోగాలను కల్పిస్తూ, ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతున్న లక్షలాది మంది చిన్న, మధ్య తరహా వ్యాపారవేత్తలే ఈ ప్రగతికి బలమైన ఆధారమని శ్రీనివాస్ కేబీబీ పేర్కొన్నారు.

- ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఎంఎస్ఎంఈలు

దేశ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కీలకమైన స్థానాన్ని కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. వ్యాపార అభివృద్ధి, ఉపాధి కల్పన, పారిశ్రామికవేత్తలకు అవకాశాలు, స్థానిక ఆర్థిక కార్యకలాపాల విస్తరణలో ఎంఎస్ఎంఈల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ఈ రంగం దేశ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 30 శాతం వరకు వాటాను కలిగి ఉండటంతో, ఈ రంగంలో పనిచేస్తున్న వ్యక్తుల ఆరోగ్య, ఆర్థిక సంక్షేమం దేశ ప్రగతితో నేరుగా ముడిపడి ఉందని వివరించారు.చిన్న వ్యాపారాలు విస్తరిస్తున్న కొద్దీ ఉద్యోగులు, ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# ఢిల్లీలో చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాలని మల్లికార్జున్ ఖర్గే కి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

- విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన ,ఖర్గే,



వనపర్తి జిల్లా నగర నిజం ఆగస్టు 21 శుక్రవారం నాడు వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి తో పాటు సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులతో కలిసి ఢిల్లీలో ఖర్గే నివాసంలో ఆయనను కలిసి ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యే మేఘారెడ్డి కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీఫార్మ్‌ను డబ్బులకు అమ్ముకున్నదంటూ, ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పై చర్యలు తీసుకోవాలనీ కోరారు ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదు పై సానుకూలంగా స్పందించిన ఆయన పూర్తిస్థాయిలో విచారించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్టు ఎమ్మెల్యే తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలి

- ఫీ రీయింబర్స్మెంట్ మాటే లేదు అని యువకుడి ఆవేదన



వికారాబాద్ జిల్లా (ఆగస్టు 21 నగరణిజం జిల్లా ప్రతినిధి) పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యువకుడు హరిదాసపల్లి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్యలో అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వంటి అంశాల్లో స్పష్టమైన విధానాన్ని ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. సాంకేతిక విద్యను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం విద్యార్థులు ఇబ్బందులు పడేలా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అనేక మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యపై ఆధారపడి భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని, వారి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రూపా రెడ్డి హత్యకు నిరసనగా మేడ్చల్‌లో శాంతి ర్యాలీ



- ఉపాధ్యాయుల భద్రత.. విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

మేడ్చల్, ఆగస్టు 21 (నగర నిజం): నల్గొండ జిల్లాలోని నాగార్జున హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రూపా రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (టి.ఆర్.ఎస్.ఎం.ఎ)మేడ్చల్ మండల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ, పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, రూపా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

- ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలి

ర్యాలీలో ఉపాధ్యాయుల్లో పెరుగుతున్న అభద్రతాభావంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మార్కులు రావాలన్నా, క్రమశిక్షణ నేర్పాలన్నా, తప్పు చేసినప్పుడు మందలించాలన్నా ఉపాధ్యాయులు భయపడే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయులకు పూర్తి భద్రత కల్పించాలని కోరారు.

- పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం

పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్ ఇచ్చి వదిలేయకుండా వారు ఏం చూస్తున్నారు, ఎలాంటి కంటెంట్‌ను అనుసరిస్తున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు గమనించాలన్నారు. మొబైల్ ఫోన్ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా ఉందన్నారు.

- పిల్లలతో మనసు విప్పి మాట్లాడాలి

పిల్లలపై అతి ప్రేమ చూపిస్తూ వారి ప్రతి కోరికను తీర్చడం కంటే, వారిలో ఏర్పడుతున్న మానసిక ఒత్తిడిని గుర్తించి సమస్యలను అర్థం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో మనసు విప్పి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు.

- పీ.టీ.మ్ లకు తల్లిదండ్రులు హాజరు కావాలి

పాఠశాలలో విద్యార్థుల ప్రవర్తనపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటారని, ఇంటికి వెళ్లిన తర్వాత కూడా తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరమని అన్నారు. పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్-టీచర్ మీటింగ్స్ కు తల్లిదండ్రులు క్రమం తప్పకుండా హాజరై పిల్లల చదువు, నడవడిక, ప్రవర్తనపై యాజమాన్యం, ఉపాధ్యాయులతో చర్చించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో(టి.ఆర్.ఎస్.ఎం.ఎ) మేడ్చల్ జిల్లా ట్రెజరర్ గిరిబాబు, మండల జనరల్ సెక్రటరీ రాధాకృష్ణ, ట్రెజరర్ జీఎల్‌వీ నారాయణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ లవకుమార్ గౌడ్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మాథ్యూ జోసెఫ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులతో పాటు మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాంకేతిక సమస్యలను సరిచేస్తున్నాము

- 3నుంచి 4 రోజుల వరకు రైతులు యూరియా బుక్ చేసుకోదని తెలిపిన ఏవో కవిత



మెదక్ జిల్లా (నగర నిజం నర్సాపూర్ నియోజకవర్గ ప్రతినిధి) ఆగస్టు 21.మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండల రైతులకు ఏవో కవిత తెలిపారు.యూరియాకి సంబంధించి ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ ను మండలం వరకే రైతులకు యూరియాను అందుబాటులో ఉంచే విధంగా యాప్ ను అప్డేట్ చేస్తున్నారని,అలాగే ఆన్లైన్లో స్టాక్ లేకపోయినా రైతులకు చూపించడం లాంటి సమస్యలను పరిష్కరించే దిశగా యాప్ లో అప్డేట్స్ జరుగుతునదని. రైతులు రాబోయే మూడు నుంచి నాలుగు రోజులు యూరియా ను బుక్ చేసుకోకూడదని తెలియజేశారు. రైతులు ఈ విషయమును గమనించి సహకరించగలరని తెలిపారు.

# పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులుగా రాజా గౌడ్, సతీష్




మెదక్ బ్యూరో : నగర నిజం ::తూప్రాన్, ఆగస్టు 21: తూప్రాన్ పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అసోసియేషన్ ప్రతినిధుల ఎన్నికల్లో బాలిశెట్టి రాజా గౌడ్, సతీష్ విజయం సాధించారు. రెండు ప్రతినిధుల పోస్టులకు ఆరుగురు అభ్యర్థులు పోటీ చేశారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా, ఎన్నికల అనంతరం బాలిశెట్టి రాజా గౌడ్, సతీష్‌లను విజేతలుగా ప్రకటించారు.



# తూప్రాన్‌లో రోడ్డుపై నిలిచిన డీసీఎం.. ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులు

- నాగులపల్లి బ్రిడ్జి వద్ద ప్రమాదం -- క్రేన్ సహాయంతో లారీ తరలింపు





మెదక్ బ్యూరో : నగర నిజం :తూప్రాన్: తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగులపల్లి బ్రిడ్జి సమీపంలోని హల్దీ వాగు బ్రిడ్జిపై శుక్రవారం రాత్రి డీసీఎం లారీ ప్రమాదానికి గురై రోడ్డుపై నిలిచిపోవడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి.ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించలేదు. సమాచారం అందుకున్న వెంటనే తూప్రాన్ ఎస్ఐ గంగరాజు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.అనంతరం క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన డీసీఎం లారీని రోడ్డు పక్కకు తరలించి, నిలిచిపోయిన వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. తక్షణమే స్పందించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు కొనసాగాయి.

# తాండూర్ సిసిఐ కాలనీలో ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు





నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్ట్ 21: శ్రావణ శుక్రవారం సందర్భంగా వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో సిసిఐ కాలనీలో యాలాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్స్ సుజాత వారి స్నేహితురాళ్లు ఆమె నివాసంలో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమానికి హాజరైన మహిళలకు వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, శాంతి వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానం ఉందన్నారు. కుటుంబ శ్రేయస్సు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కోసం మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుజాత, జ్యోతి, నందిని, హారిక పాల్గొన్నారు.

# 6, 7, 8 ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల




వనపర్తి జిల్లా నగర నిజం ఆగస్టు 21 ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 6 7 8 తేదీలలో కరీంనగర్ పట్టణంలో నిర్వహించడం జరుగుతుందని ఇట్టి పోస్టర్లను శుక్రవారం నాడు ప్రభుత్వ హాస్పిటల్ నందు కార్మికులతో విడుదల చేశారు ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మోష మాట్లాడుతూ.. కార్మిక రంగ సమస్యల పరిష్కారం కోసంకార్మికులు ఎదుర్కొన్నటువంటి సమస్యలపై మహాసభల్లో చర్చించి వాటిపై ఉద్యమ కార్యచరణను రూపొందిస్తామని. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఎదుర్కొంటున్నటువంటి సమస్యలపై పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తూ.. భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తారని తెలిపారు.. ఎంతో ప్రాధాన్యత కూడిన ఈ మహాసభలను కార్మికులు అందరూ ఐక్యంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరామ్. గోపాలకృష్ణ. ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమేష్. హాస్పిటల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీను. నాయకులు కృష్ణ రాజేష్. నరేందర్. భాగ్యమ్మ. సుజాత. ఖదీర్. శ్రీకాంత్. అశోక్. రేణుక. సరోజ. తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడమే లక్ష్యం

- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తాం



నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్ట్ 21:::గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని యాలాల్ మండలం ఎన్కేపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రారెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు, యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుర్వ మహిపాల్ ఆధ్వర్యంలో.. ఎన్కేపల్లి,తదితర గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు.ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ అధ్యక్షులు చంద్రారెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేర వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, తాండూర్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు భీమ్ శెట్టి అనిల్ కుమార్, యాలాల మండలం కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అయ్యా గాళ్ళ బీమయ్య,గ్రామ పెద్దలు, ప్రజలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాసు గోపాల్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

- బి ఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్చార్జి బాసు హనుమంతు నాయుడు



గద్వాల జిల్లా నగర నిజం ఆగస్టు 21 గద్వాల కేంద్రంలోని బాసు హనుమంతు నాయుడు స్వగృహం నందు శుక్రవారం నాడు బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు,బల్గెర ఉప సర్పంచు బాసు గోపాల్ జన్మదిన సందర్భంగా ఆయన చేతుల మీదుగా కేక్ కట్ చేపించి, శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..వీరితో పాటు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# జినుగుర్తి గ్రామంలో గడప గడపకు చీరా సారేలేతో విజయక్క సీమంత కానుక..



నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్ట్ 21::వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం జినుగుర్తి గ్రామంలో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గడప గడపకు చీర సారేలతో గర్భిణీ స్త్రీలకు ఘనంగా శ్రీమంత కానుకల కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ అధ్యక్షురాలు కంజర్ల విజయలక్ష్మి హాజరై గ్రామంలో గర్భిణీ స్త్రీలను గుర్తించి వారి గడప గడపకు వెళ్లి చీర సారేలతో గర్భిణీ స్త్రీలకు ఘనంగా శ్రీమంత కానుకలను అందించి శ్రీమంత కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీమంత కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితుల సమక్షంలో జరుపుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు.పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ సందడి చేశారు.ఈ సందర్భంగా కంజెర్ల విజయలక్ష్మి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, తల్లీబిడ్డలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నోటీసులతో మమ అనిపిస్తున్న అధికారులు








**• అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిన బడంగ్ పేట్ సర్కిల్**

**• నూతన టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్,ఏసిపి వచ్చిన మారని తీరు.**

**• నిబంధనలకు విరుద్ధంగా ఐదు అంతస్తుల నిర్మాణం జరుగుతున్న చర్యలు శూన్యం**

**• చోద్యం చూస్తున్న అధికారులు**

**• శంషాబాద్ జోనల్ కమిషనర్ దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి.**

బడంగ్పేట్ సర్కిల్ ఆగస్టు..21 (నగర నిజం) బడంగ్ పేట్ సర్కిల్ పరిధి లో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి.అధికారులు నోటీసులు ఇచ్చి తమ పని అయిపోయింది ఇక తమకేమి సంబంధం లేదన్నట్టుగా టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారని అక్రమ నిర్మాణాల పై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో బడంగ్ పేట్ సర్కిల్ పరిధి లో విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు తెలిపారు. ఇటీవల బడంగ్ పేట్,నాదర్ గుల్ మెయిన్ రోడ్డు పై ఉన్న ఒక షెడ్డు ను సీజ్ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు అని పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్న వాటిని అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని దీని వెనక ఉన్న మతలబు ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**• భారీ నిర్మాణం పై చర్యలు శూన్యం**

బడంగ్ పేట్,నాదర్ గుల్ రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఐదు అంతస్తుల భారీ భవన నిర్మాణం జరుగుతున్న అటు వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడముతో పలు అనుమానాలకు తావిస్తుంది అని పలువురు ఆరోపిస్తున్నారు. సర్కిల్ ఆదాయానికి గండి కొడుతున్న ఇలాంటి వాటి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య వీటి పై దృష్టి సారించాలని నోటీసుల పేరు తో కాలయాపన చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**• పర్మిషన్లు ఒకలా నిర్మాణాలు మరోలా**

నిర్మాణాదారులు పర్మిషన్లు తీసుకొని,నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తూ సర్కిల్ కు రావలసిన ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అధికారులు చర్యలు తీసుకోవడం లో విఫలమయ్యారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

**• చర్యలు తీసుకోని డీసీ,పట్టించుకోని జోనల్ కమిషనర్**

సర్కిల్ పరిధి లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్న బడంగ్ పేట్ డీసీ కఠినంగా వ్యవహరించకపోవడం తో పుట్టగొడుగుల నిర్మాణాలు పుట్టుక వస్తున్నాయి.ఇప్పటికైనా బడంగ్ పేట్ సర్కిల్ లో జరుగుతున్న అక్రమ కట్టడాల పై శంషాబాద్ జోనల్ కమిషనర్ దృష్టి సారించాలని వాటి పై కఠిన చర్యలు తీసుకునే విధంగా అధికారలను ఆదేశించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**• నోటీసుల తో కాలయాపన**

అధికారులు అక్రమ నిర్మాణాలు గుర్తించి వాటికి నోటీసులు జారీ చేసిన తర్వాత కొన్ని రోజులు పనులు ఆపివేసి మళ్లీ మొదలు పెడుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని నిర్మాణదారునికి,అధికారుల మధ్య లోపాయికారి ఒప్పందం వల్లే చర్యలు తీసుకోవడం లేదన్న గుసగుసలు సర్కిల్ పరిధి లో జోరుగా వినిపిస్తున్నాయి. ఇటీవల బడంగ్ పేట్ సర్కిల్ కార్యాలయానికి టౌన్ ప్లానింగ్ విభాగంలో నూతన వచ్చిన సూపర్వైజర్,ఏసిపి అక్రమ నిర్మాణాల పై కఠినంగా వ్యవహరిస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకట్ట వేయడం లో విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.

**• రాజకీయ ఒత్తిళ్లు??**

కొన్నిచోట్ల అక్రమ నిర్మాణాల పై కఠిన చర్యలు తీసుకుందామని అధికారులు అనుకున్న రాజకీయ ఒత్తిళ్ళ వల్ల వెనకడుగు వేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైనా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు అడ్డుకట్ట వేయవలసిన అవసరం ఉందని అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించి ప్రభుత్వాన్ని రావలసిన ఆదాయాన్ని పెంచాలని పలువురు కోరుతున్నారు. అక్రమ నిర్మాణదారుల పై అధికారులు కఠినంగా ఎవరిస్తారు లేదా తమకేమీ సంబంధం లేనట్టుగా మౌనంగా ఉంటార అనేది వేచి చూడాలి.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండించిన

**• వికారాబాద్ జిల్లా, తాండూర్ ప్రైవేట్ టీచర్స్ ఫోరం**




నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్టు 21:నల్గొండ జిల్లాలో ఇటీవల జరిగిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టీపిటీఎఫ్) వికారాబాద్ జిల్లా, తాండూర్ శాఖ ఆధ్వర్యంలో తాండూర్ అంబేద్కర్ కూడలిలో సంతాప సభ నిర్వహించారు. టీపిటీఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ అఖీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రూపారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య అత్యంత బాధాకరమైన, ఆందోళనకరమైన ఘటన అని పేర్కొన్నారు. విద్యాబోధనకు అంకితమైన ఉపాధ్యాయురాలిపై జరిగిన ఈ దారుణ ఘటనతో మొత్తం ఉపాధ్యాయ సమాజం తీవ్రంగా కలచివేయబడిందన్నారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, విద్యాసంస్థల సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు. విద్యాసంస్థల్లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసి, ఉపాధ్యాయులు ఎలాంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తు పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని పలువురు సూచించారు. డ్రగ్స్, గంజాయి, మొబైల్ ఫోన్ల దుర్వినియోగం, సోషల్ మీడియా దుష్ప్రభావం వంటి అంశాలపై పాఠశాలల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. చదువుతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, మానవతా దృక్పథం, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.రూపారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు డిమాండ్ చేశారు. నిందితులకు కఠిన శిక్ష విధించి, భవిష్యత్తులో ఇలాంటి దారుణ ఘటనలకు తావులేకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీపిటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు, బీసీ సంఘం నాయకులు కందుకూరి రాజ్‌కుమార్, టీజేఎస్ రాష్ట్ర నాయకులు సోమశంకర్, విద్యావంతుల వేదిక నాయకులు పరియాద రామకృష్ణ, ట్రస్మా తాండూర్ టౌన్ అధ్యక్షులు మోహన్ కృష్ణ గౌడ్, సెక్రటరీ వెంకటేష్, సీపీఐ జిల్లా నాయకులు శ్రీనివాస్, పిడీఎస్యూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, ఏ.ఆర్. లాజిక్స్ అశోక్, స్వేరో నాయకులు శివకుమార్, విద్యాసంస్థల యజమాని కీర్తి శర్మ పాల్గొన్నారు.అలాగే టీపిటీఎఫ్ ఉపాధ్యాయులు మహమ్మద్ మూధసిర్, ఖాయమ్, ఖదీర్, సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అమరిత, రజని,, తస్వీర్, అనిత, కవిత, వినోద్, సతీష్, యూనుస్, శివ, మెహెరాజ్, రాజేశ్వరి, తులసి, అమీనా తదితరులు పాల్గొని రూపారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.బీసీ సంఘం నాయకులు సాయశుకూర్, గడ్డం వెంకటేష్, జోసఫ్, పరమేశ్, షబ్బీర్ తదితరులు కూడా కార్యక్రమానికి హాజరై రూపారెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రూపారెడ్డి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని టీపిటీఎఫ్ వికారాబాద్ జిల్లా, తాండూర్ నాయకులు డిమాండ్ చేశారు.

# సుల్తాన్‌పూర్‌లో పోలీస్ కళాబృందం అవగాహన




బంట్వారం,ఆగస్టు 21 (నగరనిజం) :బంట్వారం మండలం సుల్తాన్‌పూర్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ విమల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు పాటలు, పద్యాలు, కళారూపాల ద్వారా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.సైబర్ నేరాలు, మహిళల భద్రత, మాదకద్రవ్యాల వినియోగం, నేరాల నియంత్రణ తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు వెల్లడించవద్దని సూచించారు.అలాగే మహిళలు, బాలికల భద్రత కోసం పోలీసుల సహాయాన్ని వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు. గ్రామాల్లో నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన బాట పట్టిన ఉద్యోగులు

**• పీఆర్సీ, డిఏలు, ఓపిఎస్ పునరుద్ధరణకు డిమాండ్**

**• ఆగస్టు 27న జిల్లా కలెక్టర్ ఎదుట ధర్నా**

**• 1న హైదరాబాదులో మహాధర్నా**



ఊటు యశ్వంత్
టీజీఈ జేఏసీ జిల్లా చైర్మన్



డాక్టర్: కే రామారావు
టిజిఈ జెఎసి జిల్లా కన్వీనర్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21 (నగరనిజం) : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు,కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికై తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలకు ఉద్యోగ సంఘాలు సిద్ధమవుతున్నాయి. పీఆర్సీని వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని, కంట్రిబ్యూటరీ పెన్సిల్ స్కీమ్ సిసిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ (ఓపిఎస్) విధానం పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల, ఉపాధ్యాయ, పెన్షనర్, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని హెల్త్ కార్డులు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతున్నాయి. ఉద్యోగులు బదిలీలు, పదోన్నతలు వెంటనే చేపట్టాలని జీవో నెంబర్ 25 ను సవరించి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాయి. జీవో నెంబర్ 90 అమలు చేయడంలో పాటు ఉద్యోగుల ,ఉపాధ్యాయుల పెన్షనర్, కార్మికులకు సంబంధిత ఇతర పెండింగ్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి. దశలవారీగా వారిగా ఆందోళన కార్యక్రమాలు.సమస్యల పరిష్కారానికి టీజీఈ జెఎసి ప్రకటించిన కార్యాచరణలో భాగంగా ఈనెల 27న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 1న పెన్షనర్ విద్రువ దినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ పేరుతో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. పీఆర్సీ వెంటనే అమలు చేయాలిజిల్లా టీజిఈ జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్న పిఆర్సి అమలు కాకపోవడం ఆరు డిఏలు పెండింగ్లో ఉండటం ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి కారణం అవుతుంది. సిసిఎస్ రద్దు ఓపిఎస్ పునరుద్ధరణ పై ఇచ్చిన హామీలు అమలులో జాప్యం జరుగుతుందని ఉద్యోగుల పెండింగ్ బిల్లులు ,ఆరోగ్యపతకం సమస్యలు వెంటనే పరిష్కరించి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలన్నారు. లేకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని తెలిపారు..ఉద్యోగుల హక్కులు గుర్తించాలిటీజిఈజె ఏసీ జిల్లా కన్వీనర్ డాక్టర్ రామారావుప్రభుత్వం ఉద్యోగులకు రావలసిన పెండింగ్ డిఏలు, పిఆర్సి వివిధ బిల్లులు వెంటనే చెల్లించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలన్నారు. కుటుంబ ఉద్యోగ బాధ్యతలతో సతమతమవుతున్న ఉద్యోగులపై అధికారులు వేధింపులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వం ఇకనైనా స్పందించకపోతే ఉద్యోగుల ఐక్యశక్తిని ప్రజాస్వామ్యం పద్ధతిలో చూపిస్తామని అన్నారు.

# నజీర్ భాయ్ సేవలు అందరికీ ఆదర్శప్రాయం

**• ఉప్మా నజీర్ భాయ్ ను పరామర్శించిన బుయ్యని శ్రీనివాస్ రెడ్డి.**





నగర నిజం తాండూర్ ప్రతినిధి ఆగస్టు 21 :::వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతరం రోగులకు, వారి ఉప్మా పంపిణీ చేస్తున్న నజీర్ భాయ్ సేవలను ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి ప్రశంసించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ2850 రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో నిరంతరం రోగులకు,వారి ఉప్మా పంపిణీ చేస్తున్న నజీర్ భాయ్ సేవలను ప్రశంశించి వారిని ఘనంగా సన్మానించారు.ఇటీవల ప్రమాదానికి గురైన నజీర్ భాయ్ ని పరామర్శించి, వారు చేస్తున్న సేవలను ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు.అలాగే నజీర్ బాయ్ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# సేవా కార్యక్రమాల్లో ముందంజలో అబ్దుల్లాపూర్ మెట్ మండల

# చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్











అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఆగస్టు 21, (నగర నిజం) : అభిమాన నటుడు మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని ఆయన సేవా స్ఫూర్తితో పలువురు యువకులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. తమ అభిమానాన్ని కేవలం సినీ రంగానికే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయంగా మారింది.

**• చిరంజీవి సేవా స్ఫూర్తితో ముందుకు**

మెగాస్టార్ చిరంజీవి నటుడిగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకోవడంతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. ఆయనను అభిమానించే యువత అదే స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడుతోంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, అవసరమైన వారికి అండగా నిలవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

**• అభిమానాన్ని సేవగా మార్చి**

అభిమాన నటుడిపై ఉన్న అభిమానాన్ని సామాజిక బాధ్యతగా మార్చుకుని చిరంజీవి యువత సభ్యులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో తమ వంతు సహాయం అందిస్తూ స్థానికంగా మంచి గుర్తింపు పొందుతున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయాలనే ఉద్దేశంతో యువత ముందుకు సాగుతుండటం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

**• కొన్నేళ్లుగా నిరంతర సేవ**

అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పలు సందర్భాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడుతూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించడంతో పాటు సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

**• స్థానికుల నుంచి మంచి స్పందన**

మండల చిరంజీవి యువత చేపడుతున్న సేవా కార్యక్రమాలకు స్థానికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. యువత తమ సమయాన్ని కేటాయించి సామాజిక సేవలో పాల్గొనడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. అభిమాన సంఘాలు కేవలం సినీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజా సేవలో కూడా భాగస్వాములు కావడం ఆదర్శంగా నిలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

**• యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సేవా కార్యక్రమాలు**

ప్రస్తుత కాలంలో యువత సామాజిక బాధ్యతను గుర్తించి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉందని చిరంజీవి యువత సభ్యులు చెబుతున్నారు. సమాజంలో సమస్యలు ఎదురైనప్పుడు స్పందించడం, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని పేర్కొంటున్నారు. తమ అభిమాన నటుడు చిరంజీవి చూపిన సేవా మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**• సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం**

అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతం చేయాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడంతో పాటు యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమాజానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమంలో తమ వంతు పాత్ర పోషిస్తామని తెలిపారు.మెగాస్టార్ చిరంజీవిని అభిమానించే యువత సేవా కార్యక్రమాల ద్వారా ఆయనకు తమ అభిమానాన్ని చాటుకోవడంతో పాటు సమాజానికి తమ వంతు సేవ అందించడం ప్రశంసనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.






# సేవా కార్యక్రమాల్లో ముందంజలో అబ్దుల్లాపూర్ మెట్ మండల

# చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్

















అబ్దుల్లాపూర్ మెట్ మండలం, ఆగస్టు 21, (నగర నిజం) : అభిమాన నటుడు మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని ఆయన సేవా స్ఫూర్తితో పలువురు యువకులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. తమ అభిమానాన్ని కేవలం సినీ రంగానికే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలను కొనసాగించడం అభినందనీయంగా మారింది.

**• చిరంజీవి సేవా స్ఫూర్తితో ముందుకు**

మెగాస్టార్ చిరంజీవి నటుడిగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకోవడంతో పాటు సేవా కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. ఆయనను అభిమానించే యువత అదే స్ఫూర్తితో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడుతోంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, అవసరమైన వారికి అండగా నిలవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

**• అభిమానాన్ని సేవగా మార్చి**

అభిమాన నటుడిపై ఉన్న అభిమానాన్ని సామాజిక బాధ్యతగా మార్చుకుని చిరంజీవి యువత సభ్యులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో తమ వంతు సహాయం అందిస్తూ స్థానికంగా మంచి గుర్తింపు పొందుతున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయాలనే ఉద్దేశంతో యువత ముందుకు సాగుతుండటం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

**• కొన్నేళ్లుగా నిరంతర సేవ**

అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పలు సందర్భాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడుతూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు. యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించడంతో పాటు సమాజంలో అవసరమైన వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

**• స్థానికుల నుంచి మంచి స్పందన**

మండల చిరంజీవి యువత చేపడుతున్న సేవా కార్యక్రమాలకు స్థానికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. యువత తమ సమయాన్ని కేటాయించి సామాజిక సేవలో పాల్గొనడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. అభిమాన సంఘాలు కేవలం సినీ కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజా సేవలో కూడా భాగస్వాములు కావడం ఆదర్శంగా నిలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

**• యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సేవా కార్యక్రమాలు**

ప్రస్తుత కాలంలో యువత సామాజిక బాధ్యతను గుర్తించి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉందని చిరంజీవి యువత సభ్యులు చెబుతున్నారు. సమాజంలో సమస్యలు ఎదురైనప్పుడు స్పందించడం, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని పేర్కొంటున్నారు. తమ అభిమాన నటుడు చిరంజీవి చూపిన సేవా మార్గాన్ని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

**• సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం**

అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతం చేయాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడంతో పాటు యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సమాజానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమంలో తమ వంతు పాత్ర పోషిస్తామని తెలిపారు.మెగాస్టార్ చిరంజీవిని అభిమానించే యువత సేవా కార్యక్రమాల ద్వారా ఆయనకు తమ అభిమానాన్ని చాటుకోవడంతో పాటు సమాజానికి తమ వంతు సేవ అందించడం ప్రశంసనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. అబ్దుల్లాపూర్ మెట్ మండల చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.








# ఢిల్లీలో చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాలని మల్లికార్జున్ ఖర్గేకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**• విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన ,ఖర్గే,**

వనపర్తి జిల్లా నగర నిజం ఆగస్టు 21 శుక్రవారం నాడు వనపర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి తో పాటు సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులతో కలిసి ఢిల్లీలో ఖర్గే నివాసంలో ఆయనను కలిసి ఫిర్యాదు చేశారు ఎమ్మెల్యే మేఘారెడ్డి కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీఫార్మ్లను డబ్బులకు అమ్ముకున్నదంటూ, ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పై చర్యలు తీసుకోవాలనీ కోరారు ఎమ్మెల్యే ఇచ్చిన ఫిర్యాదు పై సానుకూలంగా స్పందించిన ఆయన పూర్తిస్థాయిలో విచారించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్టు ఎమ్మెల్యే తెలిపారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, యూత్